నవయుగ

ఇందులో

★

విశ్వవిద్యార్థి ఉద్యమం - సంపాదకీయం

ఇండోనేషియాలో ప్రతిఘటన

తెలిసింది - తెలిసింది - చిన్నకథ

విశ్వ యువజనోద్యమం నిర్మించండి!

సూర్యాపేట విద్యార్థుల పోరాటం

విద్యాలయ వార్తలు

ఆంధ్ర వెయిట్ లిఫ్టర్లు - ఎహోసిగోపన్


ఆసనాలు-వాటి ఉపయోగాలు

పిల్లలమంటిపంపో గుర్తుల్లో!

మానవుడు నరికొన్ని జయించాడు

బంగారం ఎలాంటి యాత్ర అవుతుంది?

'మాతృభూమి' - గ్రంథసమీక్ష



సెప్టెంబరు, 1947

ఆంధ్ర విద్యార్థి యువజన మాసపత్రిక

నవయుగ

ఆంధ్ర రాష్ట్ర విద్యార్థి, యువజన మాసపత్రిక.

సంపుటి 1 | 1947 సెప్టెంబరు | సంచిక 8

★ సంపాదకీయం

ఐక్య విద్యార్థి ఉద్యమం

అఖిలభారత విద్యార్థి కాంగ్రెస్, విద్యార్థి ఫెడరేషన్లు భారత దేశంలో ఐక్యవిద్యార్థి ఉద్యమ నిర్మాణమును కోరిచేసిన తీర్మానములను యీసంచికలో ప్రకటిస్తున్నాం. నేడు యీ స్పష్టమైన రూపాన్ని తీసుకొనిన యీ ఐక్యతా తీర్మానములు క్రితం ఐదు సంవత్సరముల నుండి విద్యార్థులలో పెంపొందుతూన్న ఐక్యతా వాంఛా ప్రతిబింబమే. భారత స్వాతంత్ర్యోదయమైన యీ చారిత్రక సమయంలో ఇట్టి తీర్మానములు వెలువడటం ఎంతో సంతోషింప వలసిన విషయం.

నేటి విద్యార్థి లోకంలోని అనైక్యతను అంతం చేయుటకు తీర్మానములు జేయుటయే గాక - ఐక్యవిద్యార్థి మహాసభను వీలయినంత త్వరలో సమావేశపర్చుటకు చర్చలు సాగుతున్నాయి, విద్యార్థి కాంగ్రెస్ - విద్యార్థి ఫెడరేషన్‌లచే నియమింపబడిన రాయబార కమిటీలు సెప్టెంబరు మొదటివారంలో బొంబాయిలో సమావేశంగా నున్నాయి. ఈవార్తలన్నీ విద్యార్థి ప్రపంచాన్ని సంతోషంలో ఓలలాడిస్తున్నాయి. విద్యార్థులలోని చీలికలను ఆధారంగా జేసుకొని నిరంకుశ విద్యాలయాధికారులు సాగించిన దాడులు యిక ముందుండవని, ఉన్నా తగిన జబాబు విద్యార్థిలోకం యివ్వగలదని ప్రతివిద్యార్థీ నమ్ముతున్నాడు. ఇంతేగాదు, 1942 లో వలె ప్రధాన రాజకీయ సమస్యలపై బేధాభిప్రాయా లున్నవని తిరిగి విద్యార్థి ఉద్యమంలో చీలికలురావని గ్యారంటీ ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈప్రధాన విషయానికి సమాధాన మివ్వవలసిన బాధ్యత విద్యార్థి నాయకత్వంపై ఉంది.

విద్యార్థి కాంగ్రెసు నాయకత్వంలో ఒక వర్గం భవిష్యత్‌లో రాజకీయ భేదాలనే సాకుతో ఎట్టి చీలికలు రాకుండా యుండుటకు విద్యార్థి ఉద్యమం రాజకీయాలకే దూరంగా యుండాలని సూచిస్తున్నారు. విద్యార్థి లోకం యీ మార్గాన్ని అనుసరించుట యన్న, సుఖప్రదమైన విద్యార్థి జీవితంకొరకు, నిజమైనదేశ స్వాతంత్ర్యం కొరకు సర్వత్యాగాలు జేసిన విద్యార్థి వీరులకు తీరని అపచారం చేయటం మినహా మరేమీ కాదు. నేటి మన విద్యా విధానం పునర్నిర్మించవలసి యున్నది. సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థను నిర్మూలించి, ప్రజాతంత్ర ఆర్థికవ్యవస్థను నిర్మించవలసియుంది. మన దేశంలో తన పరోక్ష పరిపాలనను కొనసాగించుటకు ప్రతి నిముషం సామ్రాజ్యవాదం పెద్ద పెట్టుబడిదార్ల ద్వారా, సంస్థానాధిపతుల ద్వారా సాగించెడి కుట్రలను నిర్మూలించవలసియుంది ఈప్రధాన కర్తవ్యాలలో వేటినుండి విద్యార్థి ఉద్యమం దూరంగా యుండగలదు ? ఈ ప్రధాన సమస్యలలో రాజకీయాలకు సంబంధించని సమస్యలేమిటి? విద్యార్థి ఉద్యమం రాజకీయ జీవితంలో ప్రముఖ పాత్ర నిర్వహించుతూనే తనలోని ఐక్యతను నిల్పుకొనవలసియుంది.

ఇట్టి ఐక్యతను కొనసాగించుటెట్లు ? విద్యార్థి ఉద్యమం ఏపార్టీకి, వర్గానికితోకగాగాక స్వతంత్ర ఉద్యమంగా అభివృద్ధి జెందాలన్న ప్రధాన విషయాన్ని గుర్తించాలి, పార్టీలకు, మతాలకు విద్యార్థి ఉద్యమాన్ని ముడిపెట్టాలనెడు ప్రయత్నాలు కొనసాగినంత కాలం చీలికలు తిరిగి తలఎత్తగల ప్రమాదం యుండనేయుంది. ఇంతేకాదు. విద్యార్థి సంస్థ, తన ఐక్యతను గ్యారంటీ జేయుటకు విద్యార్థులలోని వివిధ రాజకీయ అభిప్రాయాలను గౌరవించాల్సియుంది, మెజారిటీ నిర్ణయమని మైనారిటీ హక్కులను నిరక్ష్యం జేయరాదు. మెజారిటీ ఒక నిర్ణయం తీసుకొనినా, మైనారిటీ తన వాదనను ప్రాథమిక సభ్యులలో ప్రచారం జేసుకొనే హక్కులను గుర్తించాలి. ఎన్నికలలోను, సంస్థ నిర్మాణంలోను ఏకవర్గం తమ కున్న మెజారిటీ ని అనుకూలంగ తీసుకొని యితర వర్గానికి విద్యార్థి సంస్థలో ఎట్టి బాధ్యత లేకుండా దూరంగా యుంచరాదు. ప్రతివర్గం విద్యార్థులలో ఆవర్గానికున్న పలుకుబడిని, సంస్థనిర్మాణంలో గూడ ప్రతిబింబించునట్లు ఎన్నికలు మొదలైన వాటిలో దామాషా ఓటింగుసూత్రం అనుసరించాల్సి యుంది. ప్రధాన రాజకీయ సూత్రాల నిర్ణయంలో మెజారిటీ ఓట్లతో నిర్ణయించడంగాక, అత్యధికసంఖ్యాకుల పంథాను ఐక్యవిద్యార్థి ఉద్యమం అనుసరించవలసియుంది. అప్పుడే విద్యార్థిఉద్యమం అభేద్యంగా ఐక్యతతో వర్ధిల్లగలదు.

ఇట్టి ఐక్యతను నిర్మించుటకు ప్రతివిద్యార్థి సంస్థ నేటినుంచే ఐక్యకార్యాచరణకు పూనుకొనవలసి యుంది. ఈ ఐక్యకార్యాచరణయే నేడు విద్యార్థి ఫెడరేషన్, విద్యార్థికాంగ్రెస్ కార్యకర్తలలోనిఅపోహలనుతుడిచిపెట్టగలదు. ఇరువురిలోను సంఘీభావం, సౌభ్రాతృత్వం పెంపొందించగలదు. ఇట్టి సౌభ్రాతృత్వం యిరుపక్షాల కార్యకర్తలలో యున్నయెడల ఎన్నికల తగువులకు, యితర సమస్యలకు తావే యుండదు. రాజకీయభేదాలున్నా సావధానంగా చర్చించి తీర్చుకొను పరిస్థితు లేర్పడతాయి. విద్యార్థిసమస్యలు పరిష్కార మవుతాయి.

కాని దురదృష్ట మేమిటంటే, అఖిలభారత విద్యార్థి కాంగ్రెస్ కార్యవర్గం ఐక్యతా ప్రయత్నాలు జరుపుతున్నా, ఆంధ్రదేశంలో విద్యార్థి

(మిగతా 6 వ పేజీలో)

ముఖచిత్రం : ప్రొఫెసర్ దండమూడి రాజగోపాలరావు (9 వ పేజీ)

★ ఇండొనేషియా విప్లవ

ఆగస్టు 17 ఇండొనేషియా స్వాతంత్ర్య దినోత్సవం 150 సంవత్సరాలనుండి సాగుతూ వచ్చిన డచ్చిసామ్రాజ్యవాద పరిపాలనకు ఇండొనీషియా ప్రజలు 1945 ఆగస్టు 17 తో స్వస్థి చెప్పారు. 7 కోట్ల ప్రజలు దేశం యొక్క పరిపాలనాభారం వహించారు. నూతనజీవన వ్యవస్థను నిర్మించుటకు శక్తికొలది పాటుపడు తున్నారు. ఇట్టి సమయంలో తిరిగి డచ్చి సామ్రాజ్యవాద సైన్యాలు జులై 20 అర్థరాత్రి ఇండొనీషియా రిపబ్లిక్‌పై దండయాత్ర ప్రారంభించాయి. రెండు సంవత్సరముల రిపబ్లిక్ కృషి ఫలితంగా నిర్మించిన ప్రతిదానిని విచ్ఛిన్న పర్చ సామ్రాజ్యవాదులు పూనుకొన్నారు. డచ్చి సామ్రాజ్యవాదు లీ దురాక్రమణనే "పోలీసుచర్యల"ని సమర్థించుకో జూస్తున్నారు. నిజానికి ఈ పోలీసుచర్యల వెనుకనున్న చరిత్రఏమిటి?


సిరిసంపదలు

ఇండొనేషియా అతి సారవంతమైనదేశం. ఈ దేశంలో ప్రపంచ ఉత్పత్తిలో సింకోనా 91%. బాక్సైట్‌లోహం 80%. నార 33%. తేయాకు 19% నత్తు 29%. కోకో 29%. తయారవుతుంది. ఇంతే గాక నూనె క్రూడ్ ఆయిల్ మున్నగునవి గూడ ఇండొనేషియాలో విరివిగా దొరుకుతున్నాయి. 150 సంవత్సరములనుండి డచ్చి సామ్రాజ్యవాదులు యీఖనిజ సంపదలను హరిస్తూ వచ్చారు. ఇండొనేషియానుండి వెళ్ళే ఎగుమతులలో 61% ఒక్కహాలెండుదేశానికి వెళ్ళేవి. సంవత్సరానికి సగటున 3 కోట్ల 20 లక్షలపౌన్లు (48 కోట్లరూపాయలు) ఆదాయం ఇండొనేషియానుండి హాలెండు దేశం రాబట్టుకొనే దంటే, డచ్చి సామ్రాజ్యవాదుల దోపిడి బోధపడగలదు.

స్వతంత్ర పోరాటం

జపాను రెండవ ప్రపంచయుద్ధంలో చేరగానే పసిఫిక్‌లోని పరిస్థితులు తారుమారయ్యాయి. జపాను సామ్రాజ్యవాదులకు దేశం అప్పజెప్పి డచ్చివాళ్ళు ఇండొనేషియానుండి మూటముల్లెకట్టారు. తత్ఫలితంగా 1942మార్చి 8న జపాను ఇండొనేషియాను ఆక్రమించింది. "ఆసియా, ఆసియావాసులకే" అన్న జపాను ఫాసిస్టు నినాదం ఇండొనేషియా ప్రజలలో కొంత స్థావరం సంపాదించింది. కాని జపాను పరిపాలన రుచిజూడటం ప్రారంభించిన తర్వాత ఇండొనేషియా ప్రజలు "ఆసియా ఆసియా వాసులకే" అన్న నినాద బండారాన్ని గుర్తించారు. తమ స్వతంత్రంకొరకు ఐక్యమై పోరాడాలని నిశ్చయించుకొన్నారు. వెనుకటి రాజకీయ భేదాలను మరచి ఐక్యప్రతిఘటన ప్రారంభించారు. స్వతంత్ర సైన్యాన్ని నిర్మించారు. ఇండొనేషియా ప్రజాపోరాటం ఉధృతంగా సాగుతున్నరోజుల్లో జపాను పతనమయింది 1945 ఆగస్టు 17న ప్రజా ప్రభుత్వం ఏర్పరుపబడింది.

ప్రజలను దోచుకొని తినమరిగిన సామ్రాజ్యవాదులు ఊరుకుంటారా? యుద్ధానంతరం తిరిగి ఇండొనేషియాను తమ బానిస రాజ్యంగా అట్టిపెట్టుకొనుటకు డచ్చి సామ్రాజ్యవాద ముఠా యుద్ధం ప్రారంభించింది. డచ్చి వాళ్ళకు బ్రిటిషుసామ్రాజ్యవాదులు సాయపడ్డారు. భారత సైన్యాలను, జపాను వాళ్ళను నిరాయుధుల జేయుటకనే సాకుతో పంపి డచ్చి సామ్రాజ్యవాదులతరపున యుద్ధంజేయించారు. రిపబ్లికన్ ప్రభుత్వంవెనుక నున్న ప్రజాబలం, యీసామ్రాజ్యవాదులను ధైర్యంతో ఎదిర్చింది. ప్రపంచ ప్రజా శక్తులన్నీ రిపబ్లికన్ ప్రభుత్వాన్ని బలపర్చాయి. రిపబ్లికన్ సైన్య ప్రతిఘటనముందు ప్రపంచ ప్రజాభిప్రాయంముందు సామ్రాజ్యవాదులు లొంగకతప్పలేదు. డచ్చి సామ్రాజ్యవాదులు నెలల తరబడి రాజీ సంప్రదింపులు జరిపి రిపబ్లికన్ ప్రభుత్వమును గుర్తించుతూ 1945నవంబరు 15న "లింగర్జాతి"ఒడంబడికను అంగీకరించారు



స్వతంత్రవీరుల గౌరవార్థం ఇండొనేషియా ముఖ్యపట్టణంలో నిర్మించిన స్మారకచిహ్నం

డచ్చికుట్రలు

డచ్చి సామ్రాజ్యవాదులు ఒక ప్రక్క-రాజీ సంప్రదింపులు జరుపుతూనే మరియొకప్రక్క మిలటరీసన్నాహాలను కొనసాగించుతూ వచ్చారు. 1 లక్ష 20 వేల డచ్చి సైన్యాన్ని ఇండొనేషియా దీవులలో దించారు. డచ్చి సైన్యానికి అనువైన ఆధునిక మిలటరీ శిక్షణమియ్య ప్రారంభించారు. మూడు వారాలలో ఇండొనేషియా రిపబ్లికన్ ప్రభుత్వాన్ని సర్వనాశనం జేయాలని ప్లానులువేశారు. ఈప్లానులో ఒక భాగం క్రిందనే, తాము అంగీకరించిన లింగర్జాతి ఒడంబడికను కాలదన్ని ఇండొనేషియాలోని పోలీశాఖను తమ అజమాయిషిలో నుంచాలని కోరారు. ఇది రిపబ్లికన్ ప్రభుత్వాధికారానికే భంగమని ఇండొనేషియా ప్రభుత్వం తిరస్కరించింది. డచ్చివాళ్ళ ఆస్తిపాస్తుల రక్షణ, వ్యాపార విషయాలను గూర్చి హాలెండు ప్రభుత్వం కోరినషరతుల నెల్ల ఇండొనేషియా అంగీకరించింది. కాని తయ్యానికి కాలుదువ్వుతున్న సామ్రాజ్యవాదులు ఊరకుండగలరా ! ఇండొనేషియన్లు సంధి షరతులను భగ్నపరచుతున్నారని దొంగప్రచారము ప్రారంభించి డచ్చి

చిన్న కథ

తెలిసింది - తెలిసింది

—— రావూరి గోవిందాచారి

(గీతిక)

'గగన మండలి మబ్బుతునకనై పోదునా ?
సెల ఏటిలోని చిరు కెరటమై పోదునా ?
నునుగాలి కల్లాడు లతికనై పోదునా ?
శాద్వలంబుల హిమకణమునై పోదునా ?
లేమావి . "

గున్నమీద ఏం గావాలా? అని గురుమూర్తి ఆలోచించి ఆలోచించి తోచక నిద్రపోయాడు

గురుమూర్తి ఈ మధ్య "గీతాలూ" అవ్వీ రాడయం మొదలెట్టాడు.

పక్కా భావకవిని కావాలని వాడి ఆరాటం, అంచేతేవాడు "కృష్ణశాస్త్రి"గారిలాగా "దానిలో దానినై, దీనిలో దీనినై" పోవాలని బుర్రనంతా పిసికి పిసికి అంతవరకూ రాసి పైన ఏమి రాయాలో తెలీక అలసి పడుకున్నాడు.

గురుమూర్తి గదిలోకి ఒకాయన బుర్ర మీసాలూ, తలగుడ్డ, ఓ సుమారైన శాలువా కప్పుకున్నాయనవచ్చి "దేశమును ప్రేమించుమన్నా మంచియన్నది పెంచుమన్నా"

అంటూ పాడుతున్నాడు

మాంచి నిద్రలోవున్న గురుమూర్తి ఉలిక్కి పడిలేచాడు

ఎదురుగా ఒకాయన.... బుర్రమీసాలాయన కూచుని యింకా పాడుతూనే వున్నాడు.

"ఎవరునీవు" అన్నాడు గురుమూర్తి

"నేనా. " బుర్రమీసాలాయన

"ఆఁ"

తనెవరో చెప్పకుండానే "దేశమంటే మట్టి గాదోయ్. దేశమంటే మనుజులోయ్..." అంటున్నాడు వచ్చినాయన.

గురుమూర్తికి యిల్లాంటి పాటలంటే పరమ అసహ్యం. దోకుపుడుతుంది ఎప్పుడూ "దేశం" "దేశం" "దేశం" ఏమిటి వీళ్ళపిండా కూడు.

"దేశమంటేమట్టిగాదు"ట బం గా ర మా ? వెండా ! రాగా ?

ఒక్కసారి ఈ "దేశకవుల"కు బుద్ధి చెప్పాలను కున్నాడు.

అనుకుని——

"దేశమంటే ఏమిటయ్యా" అన్నాడు ?"

దేశమంటేనా ?

"ఆఁ"

"ఏమిటంటున్నావా"?.

"ఆఁ"

"సరే రా"

ఇద్దరూ నడచి పోతున్నారు. ఎదురుగా ఒక గ్రామం కన్పించింది

గురుమూర్తి, బుర్రమీసాలాయన ఆవూళ్లో కెళ్ళారు.

వీధులన్నీ విశాలంగావున్నై. యిళ్లు ఎంతో శుభ్రంగా అందంగావున్నై మనుష్యులుగూడా బలంగా, ఆరోగ్యంగానే వున్నారు

చూస్తుండంగానే ఆయిళ్ళమీద పెంకులన్నీ, "జరజరా"——"చరచరా" వీధిలోకొచ్చినయ్ వీధిలోకొచ్చిన పెంకులు "బిలబిల్లా" డుతూ పరుగెత్తుతున్నై. ఎటు ? .

గురుమూర్తిని బుర్రమీసాలాయన పెంకు లెంబడితే తీసికెడుతున్నాడు. ఆపెంకులుపోయి పోయి యింకొక యిల్లెక్కినై..

మునుపటికంటె ఆయిల్లు పరిశుభ్రంగా—— ఆరోగ్యంగా——అందంగా—— తయారయింది

ఇంతలోకే "ఫెళ – ఫెళ" మనే శబ్దంతో పెంకుల్లేని యిళ్ళగోడలన్నీ పునాదుల్లోంచి పీక్కొని "లబ, లబ" లాడ్తూ పెంకులెక్కిన యింటిగోడలకు అతుక్కునై.

ఆయిల్లు–అరె ! యిల్లుగాదు, అది యిపుడు డాబాఐంది, ఆడాబాకు యింకా గోడలు అతుక్కుంటూనే వున్నయ్, గోడలు అతుక్కున్న కొద్దీ అదిమేడైంది. ఒకటి—— రెండు—— మూడు——నాలుగు——నాలుగు అంతస్తులమేడ యింది.

యిదివరకు పెంకుటిళ్లు ఉన్నచోట యిపుడు గుడిసెలు కప్పులేని గుడెసెలు వెలిసినై. వాటిప్రక్కనే మేడ–నాల్గంతస్తులమేడ "కల కల్లా" డుతూ వెలుగుతోంది.

"యిల్లారా" అంటూ మీసాలాయన గురు మూర్తిని లాక్కుపోయాడు

అదొక "ఫాక్టరీ" అందులో చాలామంది ఏమిటేమిటో చేస్తున్నారు.

వాళ్ళ శరీరాల్లోనుండి "చమట"కారుతోంది వట్టిచమటేకాదు——"రక్తం" ——ఎముకల్లోంచి "మూలుగు" కూడా కారుతోంది,

ఈ మిశ్రమపదార్థం కాలువ కాలువలుగా పోతుంది, ఇద్దరూ దానివెంబడితే వెళ్ళారు.

అది ఒక గదిలోకి పోయింది అక్కడ ఒకాయన బాలీసుకానుకొని సిగరెట్ కాబోలు కాలుస్తున్నాడు

అక్కడదాకా ప్రవాహంగా వున్న ప్రవాహం అక్కడ రూపాయలుగా మారింది,

రూపాయలు !

రూపాయలు !

రూపాయలు !

ఒకటే రూపాయల కుప్పలు తెప్పలు

ఇంతక్రితం ——అందరిలాగే మామూలుగా వున్న "సిగరెట్ కాల్చేఆయన" యిప్పు— లావెక్కి చిన్నపాటి ఏనుగ్గున్నంత అయ్యాడు.

పనిచేసేవాళ్ళు సన్నగా——దారంలాగా —— ఈనెల్లాగా అంటుకుపోయినడొక్కల్తో దించుక పోయిన కళ్ళతో శవాల్లాగా తయారయ్యారు.

గురుమూర్తి చెయ్యిబట్టుకుని మీసాలాయన "బరబరా" యింకోదగ్గిరికి లాక్కుపోయాడు.

అక్కడివాళ్ళు మొదటివాళ్ళకు మల్లే బాగా.... . బలంగా . వున్నారు. చూస్తుండంగానే వాళ్ళమీది పంచెలన్నీ వూడి దొర్లుకుంటూ పోతున్నై వాటిస్థానే వీళ్ళకు చిన్న చిన్న గుడ్డలు చిరిగినవి-ముంజువాసన కొట్టేవి వచ్చినై.

పోయిన పంచెలు ఒక యింటిముందు ఆగినై. ఆ యింటాయన వాటిని"సిల్కు వాటివిగా మార్చి షోగ్గా" కట్టుకున్నాడు.

"ఇటుచూడు" అన్నాడు మీసాలాయన.

గురుమూర్తి చూచాడు.

ప్రతిఘటన ★

యస్. వి. నరసయ్య

సామ్రాజ్యవాదులు ఎట్టి హెచ్చిరికా లేకయే జులై 20అర్ధరాత్రి తమదండయాత్రను ప్రారంభించారు.

ఈవెన్నుపోటుకు ప్రజాప్రభుత్వం తయారుగాక పోయినా ప్రతిఘటన ప్రారంభించారు. డచ్చివాళ్ళు యుద్ధాన్ని ఎక్కువకాలం సాగించలేరు. దినమునకు ఇండొనేషియాపై యుద్ధానికి 30 లక్షల గిల్డర్లు (డచ్చినాణెం) (45 లక్షల రూపాయలు ఖర్చుపెట్టవలసి వస్తుంది ఇప్పటికే డచ్చివాళ్ళ ఆర్థిక పరిస్థితులు తలక్రిందులై యున్నాయి అప్పుకై ఇంగ్లండు, అమెరికాలను దేవురించవలసి వచ్చింది ఈరహస్యమెరిగిన రిపబ్లికన్ ప్రభుత్వము గెరిల్లా యుద్ధాన్ని ప్రారంభించి యుద్ధాన్ని వీలైనంతకాలం పొడిగించు యూహాన్ని అమలుపర్చుతున్నారు ఈపద్ధతి సామ్రాజ్యవాదులకు మహా కంటకంగా యున్నది డచ్చిసైన్యాలు తమకున్న ఆయుధ సామాగ్రితోను, విమానబలంతోను మొదటి రోజులలో పురోగమించినా తరువాత ఎదురుముట్టడులను రిపబ్లికన్ పక్షంనుండి ఎదుర్కోవలసి వచ్చింది. అనేకచోట్ల రిపబ్లికన్ పక్షం ముఖ్యపట్టణాలను గూడ పునరాక్రమించారు.

అమెరికా, బ్రిటన్‌ల అండ

డచ్చి సామ్రాజ్యవాదుల యుద్ధ ప్రయత్నాల వెనుక బ్రిటిష్, అమెరికన్ సామ్రాజ్యవాదుల అండవుంది. బ్రిటన్ ఒక ప్రక్క ఇండొనేషియాలో యుద్ధవిరమణ కని ధర్మోపన్యాసాలు చేస్తూనే మరియొకప్రక్క యుద్ధ సామాగ్రిని డచ్చి సామ్రాజ్యవాదులకు సప్లయి చేస్తూనే ఉంది. డచ్చి సైన్యాలను ఇంగ్లండు తెచ్చి తరిఫీదిచ్చింది అమెరికా, ఇంగ్లండులు డచ్చివాళ్ళకు యుద్ధనిర్వహణకు అప్పుపెట్టాయి ఈవిధంగా ఇండొనేషియాలో యుద్ధజ్వాలలను రెచ్చగొడుతూ, దేశాన్ని తమ అధీనంలోకి తెచ్చుకోవాలని. ఇండొనేషియా మార్కెట్లను స్వాధీనం చేసికోవాలని యీ సామ్రాజ్యవాదుల ప్లాను అందుకే పోలీసుకాఖను డచ్చివాళ్ళ అధీనంలో నుంచమని లేకున్న మధ్యవర్తులకు (అమెరికాగాని, బ్రిటనుగాని అని అర్థం) వదలమని యీ సామ్రాజ్యవాదులు ప్రజాప్రభుత్వానికి సలహాయిచ్చారు భారతదేశం మిత్రరాజ్యసమితికి ఇండొనేషియా సమస్యఫిర్యాదు జేయ ప్రయత్నించగా వీలున్నంతవరకు యీ మురా అడ్డుతగిలింది.

ప్రజాశక్తుల విజయం

బ్రిటిష్, అమెరికన్ డచ్చికుట్రలను భగ్నపర్చి ఇండొనేషియా సమస్యను ఆస్ట్రేలియా. భారతదేశం మిత్రరాజ్యసమితి ముందు చర్చకు తెచ్చాయి మిత్రరాజ్యసమితి యుద్ధాన్ని తక్షణం ఆపమని ఆజ్ఞయిచ్చింది ప్రపంచప్రజాబలం ఇండొనేషియా పక్షం వహించటం సామ్రాజ్యవాదులు గుర్తించారు ఇంగ్లండులోని కార్మికులనుండి ఆస్ట్రేలియా కార్మికవర్గంవరకు ఇండొనేషియా పక్షమే డచ్చి ఓడలకు సరకులు ఎత్తే దిక్కేలేదు. భారత ప్రభుత్వం డచ్చివిమానాలు నౌకలు భారతదేశ విమానాశ్రయాలను హార్బర్లను ఉపయోగించరాదని నిషేధించింది. అందుచే డచ్చి సామ్రాజ్య వాదులు మిత్రరాజ్య సమితి నియమానికి తలవొగ్గక తప్పలేదు కాని బ్రిటిష్ అమెరికన్ సామ్రాజ్యవాదుల కుట్రఫలితంగా డచ్చిసైన్యాలను జులై 20 నాటి సరిహద్దులకు మరల్చాలె అన్న సోవియట్ ప్రతిపాదన తిరస్కరింప బడింది ఇండొనేషియాలో తాత్కాలికంగా యుద్ధవిరమణ జరిగినా ప్రమాదం ఉండనేవుంది ప్రజాశక్తులు అప్రమత్తతగా యున్నాయని సామ్రాజ్యవాదులు గుర్తించితే ఏ క్షణానయినా మరలదాడి సాగిస్తారు. మనం మన జాగరూకతతో ఉండాలి రిపబ్లికన్ ప్రభుత్వాన్ని బలపర్చాలి. భారతయువకులు వాలంటీరుదళాలను నిర్మించి ఇండొనేషియాకు సాయం పంపాలి వైద్యదళాలను నిర్మించాలి. యుద్ధానంతరం ఆసియా ఖండంలో ఏర్పడిన ప్రథమ ప్రజాప్రభుత్వ రక్షణకు ఎల్లరం పూనుకోవాలి

★

'నార్ల' వారి ఔదార్యం

★

చల్లపల్లి విద్యార్థి ఫెడరేషన్ శ్రీ నార్ల వెంకటేశ్వరరావుగారు రచించిన 'కొత్తగడ్డ' లోని రెండు నాటికలను ప్రదర్శించుటకు అనుమతి కోరగా శ్రీ వెంకటేశ్వరరావు గారు వ్రాసిన జాబును క్రింద ముద్రించుతున్నాం. రాయల్టీ కోరకుండా అనుమతినిచ్చి విద్యార్థి లోకంలో నాట్యకళాభివృద్ధికి తోడ్పడిన శ్రీ వెంకటేశ్వరరావుగారికి మా అభివందనములు.

—సంపాదకుడు.

★

మద్రాసు
16—7—47

ఏదైనా నాటికనుగాని నాటకాన్ని గాని ప్రదర్శించినప్పుడు నాటకకర్తకు ఎంతోకొంత రాయల్టీ చెల్లించాలని నా పట్టుదల. గ్రంథకర్త తన భుక్తికోసం వేరేవృత్తిని చూచుకోవలసి వచ్చినంతవరకు మనభాషలో - నిజానికి ఏ భాషలోనైనా - ఉత్తమ గ్రంథాలు వెలువడవు. ఈసూత్రాన్ని ప్రచారం చేయ్యాలనే తలంపుతోనే రాయల్టీ విషయమై నా పట్టుదల. మీరు నా నాటికలను రెండింటిని ప్రదర్శిస్తే, వాటికి రాయల్టీ ఇరవై రూపాయలు. అయితే మీకు దాన్ని చెల్లించగల తాహతు లేకపోవచ్చు గనుక, ఆ మొత్తాన్ని ముందు నాకు చెల్లించినట్లు మీవద్దు పుస్తకంలో వ్రాసుకొని, తర్వాత దాన్ని మీసంఘానికి నా విరాళంగా జమకట్టుకోండి. మీ ప్రదర్శనంపై ప్రజాభిప్రాయాన్ని వివరంగా నాకు వ్రాయండి.

—నార్ల వెంకటేశ్వర్రావు.

అక్కడ చాలామంది కూచుని "కూళ్లు" తింటున్నారు.

ఉన్నట్టుండి వాళ్ళకూడంతా అంబలైంది. కంచాలన్నీ "మ్లల్ల చిప్ప" లయినై.

ఆశ్చర్యంతో "జనం" చుట్టూ చూసింది.

వాళ్ళ "కంచాలూ" "కూడూ" బిరబిరా పోతున్నై జనం వాటివెంట పడింది.

అవిపోయి ఒకయింటో దూరినై. జనం గూడా దూరబోయింది. కాని ఎక్కడా సందు లేదు. తలుపులు కిటికీలు మూసివున్నై మూసి వున్నా. "అన్నం" "కంచాలు" మాత్రం లోపలికి దూరినై. అదే విశేషం.

లోపలాయన అన్నాన్ని "జిలేబులు", "లడ్డూలు", "రసగుల్లా" లుగా మార్చుకొని తిన్నాడు.

రకరకాలకంచాలన్నీ "వెండి" "బంగారు" కంచాల్లా మారినై.

ఈ సంగతి ఎట్లా తెలిసిందో జనానికి తెలిసింది

"మా కంచాలు మా కివ్వు" అంది జనం.

"మా కూడు మా కివ్వు" అంది జనం.

"నీవు తినడానికి వీల్లేదు" అంది జనం

లోపలాయనకు: జిలేబులు, లడ్డూతిన్నాయనకు కంపరంబుట్టింది. గుండెల్లో గుబులు, గుబులు మంది. కాళ్ళు భూమ్మీద ఆనకుండా తేలిపోతున్నై

ఆ తేలిపోవడంలోనే ఆతనికొక ఆలోచన తట్టింది

వంకెనున్న తుపాకీతీశాడు. "టఫా" "టఫా" జనాన్ని కాలుస్తున్నాడు

జనం చెల్లాచెదరౌతోంది. మళ్ళీ కూడుకుంటూంది.

"మా కూడు మా కివ్వు"

"నీవుతినడానికి వీల్లేదు"

జిలేబులు తిన్నాయన యింకా కాలుస్తూనే వున్నాడు

కొందరకు కాళ్ళువిరిగినై, కొందరికిచేతులు విరిగినై. కొందరికళ్ళు తుపాకీ గుళ్ళకు పేలిపోయినై. కొందరి గుండెలు బద్దలుగా పగిలి ప్రేవులు, రక్తం మాంసం బైటికి వెళ్ళుకొచ్చింది, ఎందరో చచ్చారు, చస్తున్నారు

కాని, "మా కూడు మా కివ్వు" అంటూనే వుందిజనం.

"అబ్బా!" అంటూ గురుమూర్తి కళ్ళు మూసుకున్నాడు.

మీసాలాయన గురుమూర్తిని గదికి తీసుకెళ్ళాడు

అరగంటకల్లా గురుమూర్తి లేచాడు, మీసాలాయన అంతే, అట్లాగేనన్నాడు

"దేశమంటే యిదే" అంటూమీసాలాయిన అదృశ్యమయ్యాడు.

గురుమూర్తి అల్లాగే దిగ్భ్రమతో చూస్తున్నాడు.

"స్వంతలాభం కొంతమానుక
పొరుగువాడికి తోడుపడవోయ్
దేశమంటే మట్టి గాదోయ్
దేశమంటే మనుజులోయ్"

(అనుసరణ)

★

సంపాదకీయం

(1 వ పేజీ తరువాయి)

కాంగ్రెస్ నాయకత్వంలో శ్రీ ఎ. యస్. ఆర్. కృష్ణ వర్గం వేరుమార్గాన్ని నడుస్తోంది ఆచరణలో విద్యార్థిఐక్యతను వ్యతిరేకిస్తున్నారు విద్యార్థులు ఐక్యంగా తమ సమస్యలు పరిష్కరించుకొనుట వీరికి రుచించుటలేదు విద్యార్థి కాంగ్రెస్‌లో ఐక్యతనుగోరే సోదరులు, విద్యార్థిసామాన్యం శ్రీ ఎ. యస్ ఆర్. కృష్ణ ఐక్యతా వ్యతిరేక పంథాను నిరసించవలసియుంది. ఈ పంథా నిరంకుశాధికారుల ప్రయోజనాలకు తోడ్పడుతుందిగాని, విద్యార్థి హక్కుల రక్షణకు తోడ్పడదని బాహాటంగా ప్రకటించవలసి యుంది

విద్యార్థి ఐక్యతా వ్యతిరేకులకు జవాబుగా విద్యార్థుల నెదుర్కొనుచున్న ప్రతిసమస్యపైన ఐక్యకార్యాచరణ సంస్థలు ఏర్పడవలసియుంది సంవత్సరాలతరబడి విద్యార్థి ఐక్యతకు అఖండ త్యాగాలుజేసిన విద్యార్థిలోకం ఎన్ని అడ్డంకులు వచ్చినా జయించి ముందుకుపోయి విద్యార్థి ఐక్యతను చిరస్థాయిగా నిర్మించగలరని ఆశిస్తున్నాం

★

సంపాదకవర్గం

అనంతపురం కాలేజీలో ఉపాధ్యాయుల - పుస్తకాల కొరత

అనంతపురం కాలేజీ వేసంగి శెలవుల తరువాత తెరువబడి నెలదాటి పోయినది కాని ఇంతవరకు ఉపాధ్యాయులకొరత, టెక్స్టుపుస్తకాలకొరత తీరనేలేదు లెక్చరర్లు లేనందువల్ల విద్యార్థులు చాలక్లాసులు పోగొట్టుకున్నారు ఇంతవరకు కాలేజీమొత్తముమీద దాదాపు 250 లెక్చర్స్ పోయినవి ఇంగ్లీషు ఉపాధ్యాయులు ఇద్దరు, సైన్సులో ఇద్దరు, హిస్టరి, తెలుగులలో ఒక్కొకరు ఉపాధ్యాయులులేరు. ఇది విద్యార్థులకు, ముఖ్యముగా సీనియర్ క్లాసులలో వుండువారికి పెద్దదెబ్బ అనంతపురం కాలేజీ గవర్నమెంటుకాలేజీ ప్రభుత్వం, యూనివర్సిటీ అధికారులు వెంటనే కదిలి ఉపాధ్యాయులను నియమించి విద్యార్థుల యిబ్బందులను తీర్పవలెను. ఇంక టెక్స్టు పుస్తకాలవిషయం మరీ అధ్వాన్నంగావుంది, ఇంతవరకు బి. ఎ. ఇంగ్లీషు పుస్తకాలు రాలేదు బి.యస్ సి, ఇంటరు విద్యార్థులకుగూడా పుస్తకాలులేవు పుస్తకాలు లేని చదువు ఎంత మాత్రముంటుందో అందరికీ తెలును అసలే విద్యాభివృద్ధిలో వెనుకబడిన మన దేశంలో చదువుకుందామన్న కొద్దిమందికిగూడ సరియైన అవకాశాలులేక పోవడం చాలశోచనీయమైన విషయం ప్రజా ప్రభుత్వం వెంటనే దీనిని సరిదిద్ది, విద్యాభివృద్ధికి దోహదమీయవలెను. ఇది ఒక్క అనంతపురం కాలేజీకి సంబంధించినదేకాదు ప్రతివిద్యాలయములోను ఇదే విధంగా ఉన్నది. కాబట్టి విద్యార్థులు, విద్యాభిమానులు, వెంటనే కదలి, ఈవిషయమై ప్రభుత్వం, యూనివర్సిటీవారు, ఏలాటి జాగు చేయకుండునట్లు చూడవలయునని కోరుచున్నాను

యస్. రామసుబ్బారెడ్డి,
పట్టణ విద్యార్థిసంఘ అధ్యక్షుడు,
అనంతపురం.

నవయుగ చందావివరాలు

సంవత్సరానికి	3- 0-0
అర్ధ సంవత్సరం	1- 8-0
3 మాసాలకు	0-12-0
విడిప్రతి	0- 4-0

ఐక్య యువజనోద్యమం నిర్మించండి!

ఆంధ్రయువకులకు విజ్ఞప్తి

ఆంధ్ర యువజనోద్యమంలోని చీలికలకు స్వస్తి చెప్పి ఉద్యమాన్ని నూతనస్థాయికి కొనిపోవు మార్గమేమిటని విద్యార్థి, యువజనసంఘాలు మూడు నెలల నుండి చర్చలు జరుపుతూవచ్చాయి. ఈ చర్చల ఫలితంగా సెప్టెంబరు ఆఖరువారంలో పెదవడ్లపూడి (గుంటూరుజిల్లా) లో యువజన ఫెడరేషన్ మహాసభను జరుప నిర్ణయించారు. ఆ మహాసభ కర్తవ్యాన్ని విపులీకరించుతూ విద్యార్థి, యువజన సంఘాల ప్రణాళికను యిచ్చట ప్రచురించుతున్నాం.

ఆగస్టు 15 తో భారతదేశంపై బ్రిటీష్ ప్రత్యక్ష పరిపాలన అంతమయింది దేశ పరిపాలనాబాధ్యత భారతీయులహస్తగతమయింది

200 సంవత్సరముల బ్రిటీష్ పాలనమన ప్రజలను కరువు కాటకాలకు లోనుజేసింది. మన ఆర్థిక వ్యవస్థను తారుమారు జేసింది; మన ప్రజలను విద్యాశూన్యులుగా అట్టిపెట్టింది, సామ్రాజ్యవాద ప్రత్యక్ష పాలనను అంతం జేయుటతోనే మన నేటి కర్తవ్యం పూర్తిగాలేదు మన ఆర్థికజీవితంలోని సామ్రాజ్యవాద చ్ఛాయల నన్నింటినీ తుడిచివేయవలసి యున్నది. దేశస్వతంత్ర పోరాటంలో అమోఘ త్యాగాలు జేసిన యువకులు, దేశ పునర్నిర్మాణ కార్యక్రమంలో ప్రధాన పాత్ర వహించవలసి యుంది. దేశంలో ప్రతి ఒక్కనికి తిండి, బట్టకరువులేకుండ యుండునట్లు కృషిసలుపవలసి యుంది ఈ మహత్తరబాధ్యతను నిర్వర్తించుటలో యువకులలో సంపూర్ణ ఐక్యత అత్యవసరం.

యువజనోద్యమకృషి

ఆంధ్రలో యువకులం గత కొన్నిసంవత్సరములనుండి ఒక సంఘటిత రూపంలోనే స్వాతంత్ర్యమునకు కృషిసల్పుతున్నాం ప్రజలలో విజ్ఞాన ప్రబోధమొనర్చాం వయోజన విద్యా ప్రచారాన్ని అమలు జరుపుతూ నిరక్షరాస్యతకు పోరాడుతున్నాం. యువకులలోని సాంఘిక దోషాలనెల్ల పారద్రోలుటకు యువజన సంఘాలు కృషిసల్పుతూ వచ్చాయి ఆట పాటల కార్యక్రమాన్ని తీసుకొని గ్రామాల్లోని యువకులలో నూతనచైతన్యాన్ని, సంఘీభావాన్ని నిర్మించగల్గాం ఈ కార్యక్రమ ఫలితంగా అనేకగ్రామాలలో యువజన సంఘాలు ప్రజల, పెద్దలగౌరవాన్ని జూరగొన్నవి వివిధ రాజకీయ కక్షలకు చెందిన యువకులనుగూడ తమలో ఐక్యపర్చగల్గాయి

ఆగస్టు 15, యువజనోద్యమం ముందు నూతన బాధ్యతలను పెట్టింది. యువకులం మనదేశ పునర్నిర్మాణంలో మనకర్తవ్యమును జయప్రదంగా నిర్వర్తించుటకు మన ఉద్యమంలోని లోపాల నెల్ల తొలగించుకొనుట అత్యవసరం. బ్రహ్మాండ మయిన యువజనోద్యమాన్ని ఆంధ్రరాష్ట్రంలో నిర్మించినా, నేటివరకు యువజనఉద్యమం రాష్ట్రవ్యాపితంగా వృద్ధిపొందలేదు ఉన్నఉద్యమాన్ని సహితం రాష్ట్రవ్యాపితంగా సమన్వయ పర్చుటగూడ లేదు ఈ ప్రధాన లోపాల్ని పారద్రోలుటకు వెంటనే రాష్ట్రసంఘ నిర్మాణం అత్యవసరం అందుకు యువకులం వెంటనే పూనుకొనవలసి యున్నది.

మన ఉద్యమ లోపాలు

ఆంధ్రదేశంలో పెంపొందియున్న యువజనోద్యమం ముఖ్యంగా గ్రామాలలోనే వ్యాప్తి జెందింది గ్రామాలలోగూడ మాగాణీ గ్రామాలకు, మెట్టగ్రామాలకు ఉద్యమ స్థాయి లో వ్యత్యాసముంది పట్టణ మధ్యతరగతి యువకులలో యువజనోద్యమస్థానం అతిబలహీనంగా యుంది విద్యావంతులయిన యువకులు, విద్యార్థిసంస్థలలో ఐక్యమైయున్నా, యువజనోద్యమంలో ఒకభాగంగా లేకుండయున్నారు. మన ఉద్యమంలోని యీ లోపాలను సరిదిద్దుకోవాలి. అందుకు అనువయిన కార్యక్రమం తీసుకొనుటకు జరుపు రాష్ట్ర యువజన ఫెడరేషన్ సభకు సన్నాహాలు జరపాలి, ఇందుకు యువకు లందరి సహాయం అత్యవసరం అప్పుడే నేడు మన ఉద్యమంలో యున్న లోపాలను సరిదిద్దుకొనగల బలమైన ఉద్యమాన్ని నిర్మించుకొనగలం.

ముందు కార్యక్రమం


యువకులం మన మేవర్గానికి సంబంధించినా ఐక్యమయి కృషి సలుపవలసిన సమస్య లెన్నో యున్నాయి. దేశంలోని అవిద్యనుపారద్రోలుట మన ముఖ్యకర్తవ్యం. భారతదేశ పునర్నిర్మాణంలో యిది యువకులు నిర్వహించవలసిన ప్రథమ కర్తవ్యం ఈ విషయంలో మనకు వియట్-నాం, ఇండోనేషియా యువకులు మార్గదర్శకులు మన దేశంలో యువకుల కెట్టి హక్కులూలేవు, ఒకప్రక్క నిరుద్యోగరాక్షసి వెంటాడుతూనే యున్నది. ఉద్యోగపు గ్యారంటీ లేదు. రైతుయువకులు జమీందార్ల పీడనకూ, కార్మిక యువకులు పెట్టుబడిదార్ల దోపిడికీ గురిచేయబడుతున్నారు. ఈ ప్రజాపీడకులను తొలగించుటకు యువకులం ఐక్యతతో కృషిసల్పాలి. దేశంలో యువకుల ఆరోగ్యం ఆటల విషయంలో ప్రభుత్వం శ్రద్ధయే వహించదు. ఈ విషయంలో జాతీయప్రభుత్వం యువకులకు కావలసిన కనీస ఆటల, విజ్ఞాన ప్రచారక సౌకర్యాలు కల్గించుటకు చర్యలు తీసుకొనునట్లు కృషిజేయవలసియుంది, ప్రతి యువకునికి ప్రభుత్వం విద్య, తిండి, ఉద్యోగం చూపించుబాధ్యత వహించాలి దేశరక్షణకు ప్రతి యువకునికి అవసరమైన కనీస మిలటరీ శిక్షణివ్వాలి ఈప్రధానకోర్కెలసాధనకు యువజనోద్యమం నేడు కృషిసలుపవలసి యుంది.

(మిగతా 9 వ పేజీలో)

లంచగొండి హెడ్మాష్టర్ని తొలగించాలి!

సూర్యాపేట విద్యార్థుల పోరాటం

హైద్రాబాదు సంస్థానంలోని కరీంనగరు విద్యార్థు లొకరాజకీయ పారశాల నడిపారు. అధికారుల దృష్టిలో అదొక మహాపరాధ మైంది. హెడ్మాష్టరు విద్యార్థులను స్కూలు నుండి వెళ్ళగొట్టాడు. కరీంనగరు విద్యార్థులు అధికారుల నిరంకుశత్వాన్నెదిరించి పోరాటం నడిపారు కరీంనగరు విద్యార్థుల పోరాటానికి సానుభూతిగ గతసెప్టెంబరులో సూర్యాపేట విద్యార్థులు సమ్మెచేశారు హెడ్మాష్టరు వెంటనే 13 మంది విద్యార్థులను స్కూలునుండి వెళ్ళ గొట్టాడు ఈ అన్యాయాన్నెదిరించుతూ విద్యార్థులు, కార్మికులు, రైతులు కలిసి ఐక్య పోరాటాన్ని నడిపారు. విద్యార్థుల, ప్రజల ఐక్యత చూచి నిరంకుశాధికారులు దిగిరాక తప్పిందికాదు.



హెడ్మాష్టరు కుట్రలు

హెడ్మాష్టరువిద్యార్థి యూనియనును నాశనముచేయపూనుకున్నాడు. క్లాసులో పాఠాలు చెప్పడానికి బదులు యూనియన్పై దుష్ప్రచారానికి పూనుకున్నాడు అందువల్ల కోర్సుకూడ పూర్తికాలేదు తల్లితండ్రులనుపిలిపించి యూనియన్లో చేరిన విద్యార్థులను పరీక్షలలో తప్పించెదనని బెదరించాడు విద్యార్థి యూనియన్కు కీలకంగా ఉందనే సాకుతో విద్యార్థి వసతి గృహంలో యెవ్వరూచేరకూడదని శాసించాడు. ప్రతిక్లాసులో విద్యార్థి యూనియన్లో పని జేయు కార్యకర్తల రికార్డును తయారు చేయించాడు. ఈవిధంగా విద్యార్థి ఉద్యమాన్ని నాశనంచేయాలని కుతంత్రాలుపన్నే యీ హెడ్మాష్టరు ప్రవర్తన యెట్టిది? అతడొక జూదరి, త్రాగుబోతు, లంచగొండి, నీతినియమాలులేని నీచుడు.

విద్యార్థుల పోరాటం

ఈ త్రాగుబోతు హెడ్మాష్టరును తొలగించాలని, వెళ్ళగొట్టిన విద్యార్థులను తిరిగి స్కూలులో చేర్చుకోవాలని సూర్యాపేట విద్యార్థులు 15 ఫిబ్రవరి 47 న సమ్మె చేశారు. సమ్మె నాలుగు రోజులు జయప్రదంగా జరిగింది హెడ్మాష్టరుకు గంగిర్లెత్తాయి. సమ్మెను భగ్నంచేయడానికై స్థానిక అమీన్తో కలిసి కుట్రసలిపి విద్యార్థులను రౌడీలతో కొట్టించాడు ఒక విద్యార్థికి బలమైన గాయాలు తగిలాయి విద్యార్థులు హెడ్మాష్టరు నడిగితే నాకేమీతెలియదని బుకాయించాడు పిమ్మట విద్యార్థులందరూ కలసి విద్యాశాఖాధికారివద్దకు రాయబారం వెళితే కొద్ది రోజులలోనే హెడ్మాష్టరును తొలగించురానని వాగ్దానం చేసాడు. కాని యింతవరకెట్టిచర్యా తీసుకోలేదు

నిర్బంధ విధానం

విద్యాశాఖాధికారి(మొహతెమీమ్) తొలగింపబడిన విద్యార్థులను చేర్చుకున్నాడు. కాని సమ్మెకు నాయకత్వం వహించిన 13 విద్యార్థులపై వారంట్లు జారీచేయించాడు. జి వీరాస్వామి అనే విద్యార్థి నాయకుని పరీక్ష సగములో అరెస్టుచేయించాడు "మీపిల్లలు యూనియన్లో చేరేటట్లయితే మీఆస్తిని జప్తు చేస్తా"మని, 6 నెలలు శిక్షవిధిస్తామని తలిదండ్రులను భయపెడుతున్నాడు. కొందరు విద్యార్థులు చదువుకూడ మానుకోవలసిన గతిపట్టింది. వేసవి శలవుల్లో పోలీసులు సీతారామయ్య అనే విద్యార్థి యిల్లు సోదాచేసి సిగరెట్లు ఎత్తుకుపోయారు. అందుకుగాను సీతారామయ్య అధికారులకు దరఖాస్తు పెట్టగా అతనిని అరెస్టుచేసి కమ్యూనిస్టులెవ్వరనున్నారో చెప్పమని చావచితకకొట్టి బి దయెత్తారు పదిరోజులు జైలులోఉంచి వదలినారు మరొక విద్యార్థిని నెలా పదిహేను రోజులు జైలులో ఉంచారు.

నిర్బంధపు "వసతి"

పరీక్షలలో తప్పిన విద్యార్థులకు తిరిగి పరీక్షలు పెట్టి గవర్నమెంటు వసతి గృహములో చేరితే ప్యాసు చేస్తానని ఆశచూపి హెడ్మాష్టరు నిర్బంధముగ ప్రభుత్వ "వసతి" గృహములో చేర్చుకుంటున్నాడు. ఇతరచోట్ల నుండి వచ్చేవారి నీ "వసతి" గృహములో చేరితేనే స్కూలులో చేర్చుకుంటున్నాడు. హెడ్మాష్టరుకూడ యీ "వసతి" గృహంలోచేరి తనతిండికయ్యే ఖర్చును విద్యార్థుల మీద రుద్దుతున్నాడు హాస్టలుకని ప్రభుత్వముగ్రాంటుచేసిన రు 3600 లలో వంటకు మాత్రం పాతసామాను కొని మిగతాడబ్బు కాజేశాడు. సిగరెట్లకుకూడ విద్యార్థులను పీడించుతుంటాడు, చెన్నారెడ్డి అనే విద్యార్థి ఇంగ్లీషులోతప్పి, తర్వాత పరీక్షలో ప్యాసయినా, విద్యార్థినాయకుడనే సాకుతో అతనిని హాస్టలులో చేర్చుకో నిరాకరించాడు. తప్పిన విద్యార్థులవద్ద లంచాలు వసూలుచేసి ప్యాసుచేస్తున్నాడు. ఆరవ తరగతి విద్యార్థి 3 సబ్జక్టులలో తప్పగా 100 రూ లు లంచం తీసుకొని ప్యాసుచేసినాడు. ఒక మార్వాడీ విద్యార్థివద్ద క్రొత్తగొడుగు తీసుకొని ప్యాసు చేసినాడు. మరికొందరివద్ద నెయ్యి, మంచాలు తీసుకున్నాడు.

(మిగతా 9 వ పేజీలో)

విద్యాలయ వార్తలు

— యం. ఆర్ కె.

ఆంధ్రలో తిరిగి డిటెన్షన్ సమస్యలపై సంచలనం ప్రారంభమయింది ఐక్య పోరాటాలు తలఎత్తాయి. శ్రీ జి. లింగారెడ్డి, డిటెన్షన్ విధానం రద్దుకావాలని ఆమరణ నిరాహార దీక్ష యూనివర్సిటీ భవనంముందు జులై 18 తేదీనుంచి ప్రారంభించారు విశాఖ విద్యార్థులు ఐక్యంగా కార్యాచరణ కమిటీని ఎన్నుకొని డిటెన్షన్ వ్యతిరేక ఉద్యమం మొదలుపెట్టారు. ప్రజలలోను, విద్యార్థులలోను తీవ్రప్రచారం చేసారు వైస్‌ఛాన్సలరు సి. ఆర్ రెడ్డిగారు తన పాతధోరణిలో విద్యార్థుల కోర్కెలను పెడచెవిని పెట్టారు విద్యార్థుల ఆందోళనపట్ల నిరంకుశంగా ప్రవర్తించటం అలవాటైపోయిన సిండికేటును లొంగదీయుటకు విద్యార్థులు కంకణంకట్టారు. జులై 25 ఆంధ్ర సిండికేటు సమావేశం ఆ రోజున పెద్దఊరేగింపు, బహిరంగ సభ జరిపి విద్యార్థులకు సమ్మెపిలుపు అందచేసారు 23 వ తేదీకే రాష్ట్రవిద్యార్థిఫెడరేషన్ ప్రతినిధి దాసరి నాగభూషణరావు ఆంధ్రవిద్యార్థుల సానుభూతిని విశాఖవిద్యార్థులకు అందచేస్తూ, సిండికేటుకు మెమొరాండమును అందచేయుటకు గుంటూరునుంచి వాల్తేరువెళ్ళారు. విద్యార్థికాంగ్రెసు ప్రతినిధికూడా వెళ్ళారు. విద్యార్థుల కోర్కెలను సిండికేటుసమావేశంలో చర్చనీయాంశంగా చేస్తానికి కృషిచేస్తామని శ్రీ సర్వేశ్వరశాస్త్రి, ఉయ్యూరుకుమారురాజాగార్లు వాగ్దానంచేసారు. 25 న యూనివర్సిటీలో సిండికేటు సమావేశం జరుగుతోంది బయటవిద్యార్థులు ఐక్య ప్రదర్శనంచేస్తున్నారు. ఇంతలో విద్యావ్యాప్తిని అరికట్టే విద్యావేత్త బందరు ప్రిన్సిపాల్, సిండికేటుకు వచ్చాడు. విద్యార్థిలోకానికి, పరమశత్రువైన యీ ప్రిన్సిపాల్‌ను తగిన విధంగా నల్లజెండాలతో ఆహ్వానించారు ఐక్యకమిటీ ఆధ్వర్యాన ఉధృతమవుతున్న పోరాటాన్నిచూచి సిండికేటు కంపించిపోయింది ఐక్యతాశక్తికి తలఒగ్గి డిటెన్షన్ విషయం, జగన్నాథరెడ్డి విషయం చర్చించారు లింగారెడ్డిగారు అవలంబించిన పద్ధతి (నిరసనదీక్ష) తాము అంగీకరించలేమని, ఎకాడమిక్ కౌన్సిల్‌లో డిటెన్షన్ పద్ధతిని గురించి చర్చించుతామని, జగన్నాథరెడ్డి సర్టిఫికెట్ తిరిగియిచ్చివేయుటకుతీర్మానించారు, సిండికేటు హామీవలన ఆంధ్రలో డిటెన్షన్ పోరాటం సాగించుతామని కార్యాచరణకమిటీ, యితరపెద్దల హామీవలన లింగారెడ్డిగారు నిరసనవ్రతం సమాప్తిచేశారు, విశాఖవిద్యార్థుల ఐక్యకృషి, ఆంధ్రయూనివర్సిటీ అధికారుల నిరంకుశత్వానికిమొదటిదెబ్బ ఆంధ్రవిద్యార్థులు విశాఖవిద్యార్థులు ఐక్యబాటన ముందుకుసాగి, యూనివర్సిటీని ఆంధ్రప్రజల విజ్ఞాన నిధిగా తయారు చేయాలి.

విద్యార్థిసేవకు ఐక్యకమిటీలేసాధనాలు

వాల్తేరు విద్యార్థులు ప్రారంభించిన డిటెన్షన్ వ్యతిరేక ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోయేందుకు గుంటూరు విద్యార్థులు పూనుకున్నారు.



కాని స్థానికవిద్యార్థి కాంగ్రెసు నాయకులు యీవిషయం పట్టించుకోలేదు విద్యార్థి సమస్యల పూర్తిపరిష్కారానికి ఐక్యత ఒక్కటే ఆయుధమని గుర్తించిన కొంతమంది విద్యార్థి కాంగ్రెస్ కార్యకర్తలు విద్యార్థి ఫెడరేషన్, యితర పార్టీల విద్యార్థులు జులై 26 న బహిరంగసభ ఏర్పాటుచేసి ఐక్యకమిటీని ఎన్నుకొన్నారు. శ్రీ కె. ఎల్. హనుమంత కార్యదర్శులుగా ఎన్నుకోబడ్డారు. హొటల్, యిండ్లు, డిటెన్షన్ సమస్యలపై యీ కమిటీ పనిచేస్తోంది. ఆంధ్ర విద్యార్థులకు యిది ఒక చక్కని ఆదర్శం.


బందరు కాలేజీ పతనం ప్రారంభమైందా ?

బందరు కాలేజీ ప్రిన్సిపాల్ నిరంకుశత్వానికి, మూర్ఖత్వానికి ఈ సం॥ దాదాపు 200 మంది విద్యార్థులు బలిఅయ్యారు, వీరు నానా అవస్థలుపడి ఇతర కాలేజీలలో చేరవలసి వచ్చింది 20 మంది విద్యార్థులపై పోలీసుకేసు నడపబడుతూఉంది 50 మందిని సెప్టెంబరు పరీక్షకుకూడ పంపలేదు. వీరుకాకుండా మిగిలి ఉన్నవిద్యార్థులపైకక్షసాధించ పూనుకున్నాడు. 40 మంది విద్యార్థులకు రోజులు తక్కువయినాయని, కాండొనేషన్ ఫీజు కట్టమని నోటీసు పంపాడు. వెంటనే విద్యార్థులు డబ్బుకట్టి నప్పటికి, నిర్ణీతమైన తేదీలోగా, యూనివర్సిటీకి పంపకతనవద్ద తొక్కిపట్టి ఆలస్యంగా పంపాడు, నిర్ణీతమైన తేదీ దాటిపోయినది, కావున ఆ తేదీనుండి రోజుకు 5రూలు యూనివర్సిటీకి అదనంగా కట్టవలసి వచ్చింది దీని ఫలితంగా ఈ 40 మంది రూ 3000 కట్టవలసి వచ్చింది కొంతమంది డబ్బుకట్టలేక తిరిగి మొదటి సం॥ చదువుచున్నారు.

విద్యార్థులసంఖ్య కాలేజీలో తగ్గడంతోబాటు లెక్చరర్లసంఖ్య తగ్గుతోంది. ప్రిన్సిపాల్, కమిటీ నిరంకుశత్వాన్ని సహించలేక, నికృష్ట జీతాలతో జీవితం గడుపలేక, లెక్చరర్లు కాలేజీకి గుడ్ బై (Good Bye) చెపుతున్నారు. ఈ సం॥ షుమారు 17 మంది లెక్చరర్లు మానుకున్నారు లెక్చరర్లులేక 2 సెక్షన్లు ఒకటిగా చేశారు. క్లాసులకు సరిగారాని ప్రిన్సిపాల్ ఇంటర్ విద్యార్థులకు ఇంగ్లీషు డ్రామా బోధిస్తున్నాడు

ప్రిన్సిపాల్ దుశ్చర్యలను విచారించేందుకు యూనివర్సిటీ ఒక విచారణకమిటీని వేసిందని తెలుస్తుంది. పై సంఘటనలు వాస్తవికతను తెలియజేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రిన్సిపాల్‌ను, కమిటీని, తొలగించి కాలేజీని ప్రభుత్వం తీసుకొని కాలేజీ అభివృద్ధికి దోహదంచేస్తారా.

★



ఫొటో:
పి. మధుసూదనరావు

బందరు ప్రిన్సిపాల్‌ను తొలగించాలని అక్టోబరు సమ్మెదినాల్లో విద్యార్థుల సమావేశం

అమెరికను క్రైస్తవ మిషనరీ రాయ్‌స్టాకు సమ్మెను భగ్నంచేయుటకు పడరానిపాట్లు పడ్డాడు. హిందూ — ముస్లిం విభేదాలను, క్రైస్తవ - క్రైస్తవేతర విద్వేషాలను రెచ్చగొట్టి చూచాడు. అన్నింటినీ విజయవంతంగా ఎదిర్చి ఆంధ్ర విద్యార్థి ఫెడరేషన్ నాయకులు విద్యార్థుల సమ్మెపోరాటాన్ని నడిపారు. బ్రహ్మాండమైన ఆ ఊరేగింపులు, ప్రదర్శనాలు, పికెటింగు, బహిరంగసభలు నేటికీ మరువరాని ముక్కుంపట్టు ఘట్టాలు. ఒక్క గుంటూరు పట్టణాన్నేగాక ఆంధ్ర విద్యార్థి ప్రపంచాన్నంతా ఊపివేశాయి. విద్యాలయాధికారులను రాజీకి దింపుకు వచ్చాయి. ఈ పిలుపునందుకొనే బందరు హిందూకాలేజి విద్యార్థి సంఘం టిఫెన్ల సమస్యపై సమ్మెలో దూకింది. నేటికీ నిరంకుశపెత్తనం చలాయిస్తూ విద్యార్థులపట్ల పోలీసు ఉద్యోగివలె వ్యవహరిస్తున్న రామకృష్ణారావే ప్రిన్సిపాలుగ ఉన్నాడు. మంకుతనము, అహంభావము మూర్తీభవించి ప్రజాతంత్ర ఛాయలనే చూడ కల్పురాని ఈపేమిబెత్తపు విద్యావేత్త ఆనాడు గూడ పోలీసు సాయంవరకు పోయాడు. తుదకు రాజీవల్ల సమ్మె ముగిసింది. గత పదేండ్లుగ పాత ప్రపంచమేమారి మరొకనూత్న ప్రజా ప్రపంచముత్పన్నమవుతున్నా, బందరు కాలేజి ప్రిన్సిపాలు రామకృష్ణారావు మాత్రం, 'ఉన్మాదుడు సూర్యునిపై కోపంతో ఉమ్మివేసినట్లు' పురోగామిశక్తియైన విద్యార్థి ఉద్యమంపై బుసలు కొడుతూనే వున్నాడు. విశాఖపట్నం ఆంధ్ర మెడికల్ విద్యార్థులు తమ డిగ్రీల రికగ్నిషన్ కోసరం బ్రహ్మాండమైన సమ్మె పోరాటం సాగించి, కాంగ్రెసు మంత్రుల వాగ్దానంతో విరమించారు. గుంటూరు, బందరు, విశాఖపట్నపు కాలేజీల సమ్మెజ్వాలలు రాష్ట్రమంతటా హైస్కూళ్ళకు వ్యాపించాయి. వే
మంది విద్యార్థులు వీరోచితంగా పోరా
పేర్కొనదగిన విజయాలను సాధించా
వందలమంది విద్యార్థి వర్కర్లు వ
తయారయ్యారు. సామ్రాజ్య వ్యతిరే
చైతన్యం, స్వాతంత్ర్య పిపాస పరుగు
పురోగమించింది. ఆంధ్ర విద్యార్థి ఫెడరేష
విద్యార్థి నాయకుడుగ, బాపిన విద్యావ్యతి
స్వాతంత్ర్య సైనికుడుగ ఆంధ్ర జాతీయోద్య
చరిత్రలో చెరప సాధ్యంగాని సిరాతో లిఖిం
బడింది.

ఆంధ్ర విద్యార్థి ఫెడరేషన్ - విద్యా ఐక్యతకు కృషి

బలీయమైన ఆంధ్ర విద్యార్థి ఉద్యమ
మద్రాసులో జరుగుతున్న అఖిలభారత విద్యా

మిగతా 28 వ పేజీలో

ఆంధ్ర విశ్వ విద్యాలయ

సంస్కృత విద్యార్థుల దుస్థితి

రామవరపు పద్మనాభశాస్త్రి

ఆంధ్రదేశంలో అయిదు సంస్కృత కళాశాలలున్నవి. ఈ ఉన్నవానిలో హాస్టలు సదుపాయములు విజయనగరం నెల్లూరు కళాశాలలకు దప్ప మిగిలిన వానికి లేవు. చిట్టిగూడూరు పల్లెటూరగుటచే భోజన సదుపాయంలేదు. తెనాలి. కొవ్వూరు, పట్టణములగుటచే హోటలు సదుపాయమును కల్గియున్నవి. కాని హోటళ్ళలో సుమారు నెలకు 20 రూ. తీసుకొనుచున్నారు. సంస్కృతము చదువు విద్యార్థులన్న, వారి ఆర్థికస్థితి వెంటనే గోచరమగుచునే యుండును. వారములుచేసి కొందమన్నా, రేషనురోజులు. హోటళ్ళలో భోజనం చేసి చదువుకొనుటకు నెలకు సుమారు 30 రూ కావలయును. అయినను ఖర్చుపెట్టి పూర్తి చేసిన పిదప వీరలకిచ్చు జీతములు ముప్పదికంటె నెక్కువ లేదుగదా! క్రొత్తగా ఉపాధ్యాయ ట్రైయినింగును ప్రవేశపెట్టారు. ఈ ట్రైనింగు సీటు కావలయునన్న స్కూల్ ఫైనల్ ప్యాసైయుండవలయును. లేదా కొంత సర్వీసుండవలయును.

ఇక యూనివర్సిటీ యెట్లున్నదో చూతము. పైన చెప్పిన కళాశాలలలో నేయొక్క కళాశాలకు యూనివర్సిటీ పరీక్షల జరుపు నధికారము లేదు. ఇదివరకు 13 రూపాయిలు పరీక్ష ఫీజ యితే యీ వత్సరము రూ. 25 లు చేసినారు.

ఇక పండితుల జీతాలు· ఏ స్కూలులోను పండితులకు సుమారు 40 రూపాయలకంటె జీత మధికములేదు. నేటి పరిస్థితులనుబట్టి నలభై రూపాయల జీతమంటే రమారమి ఒక విద్యార్థికి నెలకు ఖర్చైనంతన్నమాట, ఈ పరిస్థితులలో పండితులు విద్యను గఱపుటెట్లు? క్రొత్తనియమంప్రకారం ట్రెయినింగు చదువుటెట్లు? ట్రైనింగు చదివేవారికి స్టయిఫండులేదు. లాడ్జింగులేదు, చేతిడబ్బు ఖర్చుపెట్టుకొనిన యెడల హాస్టలుమాత్రమున్నది. నెలనెలా వచ్చే జీతము చాలక కటకట లాడుచున్న పండితులు సంసారముతో రాజమండ్రిలోనుండి ట్రయినింగు చదువుటెట్లు?

ఇక విద్యావిధానము: యూనివర్సిటీలో పాఠ్యగ్రంథములను నిర్ణయించు సంఘములో సభ్యులు వాళ్ళ పుస్తకములనో లేక బంధుమిత్రాదుల పుస్తకములనో నిర్ణయించుట, అవి బాగున్నను బాగులేకపోయినను సరే, దొరకినను దొరకకపోయినను సరే. భాషాప్రవీణ 'ప్రిలిమినరీ' వారికి చాలా సంవత్సరములనుండి 'కవిజనాశ్ర'మున్నది. అదిసుమారు మూడు సంవత్సరములనుండి ప్రచురింపబడుటలేదు అట్లే భాషాప్రవీణ 'ఫైనల్ కోర్సులో' విజయనగర సామ్రాజ్యము 1 వ భాగంపెట్టినారు అది దొరుకుటలేదని చెప్పగా 'కవితరంగిణి, యను గ్రంథమును ఛాయస్సుగా నిచ్చియున్నారు

ఇకపరీక్షావిధానము. మద్రాసు యూనివర్సిటీలో 100 కి 60 మంది ఉత్తీర్ణులగుచున్నారు మన యూనివర్సిటీలో సుమారు 40 మంది ప్యాసగుచున్నారు. పరీక్షలు మార్చిలో జరుగుతాయి. భాషాప్రవీణవారికి 'తెలుగు సంస్కృత' మని రెండు భాగములు, అందులో నేయొకటిలో తప్పినను మరల మార్చి వరకాగవలయును. ఈ సబ్జక్టుసు ప్యాసగుటనునది విద్యాప్రవీణ మొదలైనవి చదువువారలకులేవు. విద్యాప్రవీణచదువువారలు యేఒక పేపరులోతప్పినను మరలపూర్తిగా అన్ని పేపర్లువ్రాయవలెను. కావునవారలకుగూడ భాషాప్రవీణ వారలకున్న సదుపాయమును కలుగజేయవలెననియు ఇంగ్లీషు చదువువారలకున్నట్లు మాకును సెప్టెంబరులో నొకపరీక్షను పెట్టవలసినదిగా యూనివర్సిటీ వారిని ప్రార్థించుచున్నాను.

ఈ కష్టములన్నియు తొలగించుకొనుటకుగాను ఇతర విద్యార్థి సంస్థలన్నియు మా సంస్కృత విద్యార్థులకుతోడ్పడగలవని యాశించుచున్నాను. సంస్కృత విద్యార్థులందరు నొక సంఘముగనేర్పడి కష్టములు తొలగించుకొనుటకు యత్నములు సలుపవలసినదిగా ప్రార్థించుచున్నాను.

★

బుడబుక్కల

దిగుదిగు ముండా, దిగు ముండా॥
పాకిస్థానం పంచానంటూ
హిందూస్థానం యిచ్చానంటూ
నాజీస్థానం రాజుల కిచ్చి
గుడుగుడు గుంచం గుసగుసలాడి
నీకు తోడుగా నే వుంటానని
నాకు నీడగా నీవుండాలని
స్వదేశరాజు సౌధాలల్లో
నక్కి కూర్చునే టక్కరిముండా
నిక్కిచూస్తువా శ్వేతముఖీ
దిగు దిగు. .

వద్దు వద్దు మీతో పొత్తొద్దని
యుద్ధమైన సంసిద్ధమేనని
స్వతంత్రమంటే మా యిష్టంబని
వితర్కాలతో విర్రవీగుతూ
విప్లవ శక్తిని చప్పరింతుసను
సి. పి. అయ్యరు చెలికాడంటూ
తిరువాన్కూరులో తిరిగే ముండా
దిగు దిగు.. .

వస్తూ తెచ్చిన కావలికుక్కలు
గస్తీ తిరిగే కావలికుక్కలు
విప్లవ సింహం విజృంభిస్తే
గుండె చెదిరి కూలి పోవగా
సీమకు బాటలు చూపిస్తా
వెనకా ముందూ పారజూచుకొని
వెంటతీసుకొని వేంచేయగా
దిగు దిగు .

—కానూరు వెంకటేశ్వర్లు

★

వ్యాసకర్తలకు హెచ్చరిక

'నవయుగ' కు వ్యాసములు, వార్తలు పంపువారందరు కొట్టివేతలు, తుడుపులు లేకుండా కాగితములకు ఒక ప్రక్కన మాత్రమేవ్రాసి ప్రతినెల 10 వ తారీఖులోపల పంపాలి, అంగీకరింపని వ్యాసములు మొదలైనవాటిని త్రిప్పి పంపగోరువారు తమ రచనలతోపాటు పోస్టుబిళ్ళలు, వారి అడ్రసు పంపాలి సంపాదకునకు వ్రాసే ఉత్తరాలకు ప్రత్యుత్తరాలు కావాలంటే రచయితలు తమ అడ్రసుతో కార్డు లేక కవరు పంపాలి, లేనియెడల సమాధానాలు పంపబడవు.

— సంపాదకుడు

ఎల తెలంగాణా

వెలిగిందోయ్ తెలంగాణా
కదలెన్ విప్లవపధాన
1. నవభారత భాగ్యోదయ
సవనంబున కిరణంబై
నరవేదన పరపీడన
పరిమార్చగ జనతేజము ॥వె॥
2. అణగారిన హృదికోరిక
కణజాలము ఎగసిందోయ్
అవినీతుల పదఘట్టన
యమబాధలు సమయించగ ॥వె॥
3 చెంసాలలు పెనుబాధలు
సైన్యాలు తుపాకిబార్లు
మరణానికి వెరపేలని
సెగనెత్తుటి జవయుందని ॥వె॥
4 దురహంకార నిరంకుశ
భవనాలకు పొగక్రమ్మెను
జనశతృవర్గ పీడాపరి
పాలన కెసరెక్టెను
జనరక్తము తలకెక్కిన
ఘనపించల వణికించెను
నరహంతక ధనికపాలన
నశియించును నిజమేనన ॥వె॥

— గోపాలం

★

లేవాలోయ్!

మోసాన్ని గుర్తెరిగి లేవాలోయ్
మోసకారుల దరుమ రావాలోయ్
పీడకుల నోడింప పీడితప్రజలందరు
వీరాధివీరులై పోరాటమునదూకారు
అరుగో తిరువాన్కూర్ హైదరాబాదులో
కాశ్మీరమున ప్రజా స్వాతంత్ర్యశంఖాన్ని
పూరించి సమరాన దూకారోయ్
పోరి విజయమందగా నిల్చారోయ్
సంస్థానములప్రజా స్వాతంత్ర్యవెల్లువను
మతతత్వ కలహమని మాయనాటకమాడి
ముందుగానే అణచ బూనిందోయ్
హిందుముస్లిములంత గలియాలోయ్
కాంగ్రేసు, లీగులూ - కమ్యూనిస్టులు గలసి
అఖిల భారతమంత - అండగా నిలుచుండి
సంస్థాన ప్రజల బలపరచాలోయ్
స్వాతంత్ర్య సమరాన్ని సాగించాలోయ్.

వట్టికొండ రామకోటయ్య.

కోయ ప్రజల అభివృద్ధికై ప్రభుత్వం వెంటనే పూనుకోవాలి

సత్తిరాజు రామచంద్రరావు

మన ఆంధ్రదేశంలో ఏజెన్సీ ప్రాంతాల్లో అజ్ఞానదశలో అడవులలో జీవితాన్ని గడుపుతున్న కోయలు, సవరులు మొదలైన వెనుకబడిన జాతులను గురించి మన ప్రజలకు విరివిగా తెలియదు, కోయ ప్రజలనగానే వారి ధైర్య సాహసాలు, విలువిద్యా నైపుణ్యం, ఆటవిక జీవితము గుర్తుకువస్తాయి, కాని ఇవి మాత్రమే వారి జీవిత స్థితిగతులను పూర్తిగా చిత్రించలేవు. బంతచాకిరీ, కొరడా దెబ్బలు, దుర్భర దారిద్ర్యము, నిరక్షరాస్యత - యివీ కొద్దిలో చెప్పాలంటే కోయప్రజల జీవిత స్థితిగతులు. "నేరస్థజాతులచట్టం" వంటి నిరంకుశ చట్టాలతోబ్రిటిషుగవర్నరులు, వారి యేజంట్లు అచ్చటి ప్రజలను బానిసత్వంలో బంధించివేశారు. నిరంకుశ ప్రభుత్వం తమ దోపిడీని, నిరంకశత్వాన్ని యధేచ్ఛగా కొనసాగించుకునేందుకై వారిలో విద్య, విజ్ఞానం వ్యాపించనీయకుండా ఆటంకపరిచారు, అచ్చట సహజసంపదల నభివృద్ధి పరచకుండా వారిని దుర్భరదారిద్ర్యంలో అణచిపెట్టారు,

కోయల విద్య

ఈ ఏజెన్సీప్రాంతాల అభివృద్ధికని ప్రభుత్వ బడ్జెటులో కొన్ని సౌకర్యాలు కల్పించినా అవి నామమాత్రమేనని చెప్పాలి. ఆంధ్ర కోయ యువకులలో చదువుకున్న వారి సంఖ్య 200 మందికి ఒకడు. పొట్టకూటికి గడవక పుల్ల లమ్ముకుని జీవించే ప్రజలు తమ బిడ్డలకు యెంతవరకు చదువు చెప్పించగలరు? అయినప్పటికి తమ బిడ్డలు చదువుకున్న తరువాత తమ కుటుంబానికి తిండి, గుడ్డ సంపాదించుతారనే ఆశతో పిల్లలను స్కూలుకు పంపడం జరుగుతున్నది. స్కూళ్ళు దగ్గరలో వుండవు. కోయ విద్యార్థులు కనీసం అయిదు మైళ్ళయినా నడచి స్కూలుకు వెళ్ళాలి. చింత అంబలితో ఆకలి తీర్చుకుంటుంటారు. హైస్కూలుకు వెళ్ళాలంటె 50 మైళ్ళయినా వెళ్ళాలి, అందువల్ల నూటికి 99 మంది కోయబిడ్డలు 5 వ తరగతి లోపుగనే చదువుకు స్వస్తి చెప్పవలసి వస్తుంది.

ఈఆటంకాలన్నీదాటి హైస్కూల్లోచేరేవారి దురవస్థలు వేరేచెప్పనక్కరలేదు నలుగురైదుగురు విద్యార్థులు కలిసి యొక పూరిగుడిసెలో వుంటుంటారు. వంటకూడ తరచు వారేచేసుకుంటుంటారు. కోయవిద్యార్థులలోని అమాయకత్వాన్ని ఆధారంగా చేసుకొని వుపాధ్యాయులు తమయింటిలోని వెట్టి చాకిరిఅంతా చేయించుకుంటాదు. శిష్యుడు గురు శుశ్రూష చేయవలెనని నీతిబోధ చేస్తూ వారిని మభ్యపెడుతుంటాదు. చదువుకుందామని గుడిసెకు వెడితే దీపంలోకి కిరసనాయిలుండదు. బట్టలు తుక్కోవడం, వంటవండుకోడం మొదలుకొని గురువుగా రింటి వద్ద ఉండే పనివరకు చేస్తూ పిటికి తోడు దీపానికి కిరసనాయిలులేక బాధపడుతూ కోయవిద్యార్థులేవిధంగా చదువు కొనసాగించగలరు. అందువల్ల కోయ విద్యార్థులు పరీక్షలలో తప్పడం తటస్థిస్తున్నది. తప్పితే ప్రభుత్వం గ్రాంటులివ్వదు. గనుక హైస్కూలుదశతో విద్యార్ధి దశసమాప్తము. చదువు మానిన యువకులు తిరిగి తమ తలిదండ్రులవలెనే కట్టెలమ్ముకోవడం, వెట్టిచేయడంమొదలయిన దాస్యజీవితానికి లోనుగావలసి వస్తున్నది.

ప్రభుత్వ కర్తవ్యం

ప్రభుత్వం కోయప్రజలవంటి వెనుకబడిన జాతు లభివృద్ధికై ప్రత్యేక శ్రద్ధవహించాలి. అచ్చటి ప్రజల విద్య, విజ్ఞానాభివృద్ధికై ప్రభుత్వము వెంటనే పూనుకోవాలి వారిలో విద్యావశ్యకతనుగూర్చి విరివిగా ప్రచారంచేయాలి. వారిలో విద్యాభిరుచి పెంపొందుటకుగాను కోయ విద్యార్థులకు అధిక విద్యావేతనా లివ్వాలి, యెక్కువస్కూల్సును స్థాపించాలి. కోయ విద్యార్థుల కుచితంగా విద్య, భోజన, నివాస సౌకర్యాలను కల్పించాలి వీటన్నిటికైగాను ప్రభుత్వం తన గ్రాంటును యెక్కువచేయాలి, అచ్చటి సహజ సంపదలను పూర్తి వినియోగమునకు తీసికొనివచ్చి పరిశ్రమాభివృద్ధికై ప్రభుత్వం పూనుకోవాలి.

★

ఆసనములు : వాటి ఉపయోగములు

శ్రీ కోన వెంకటేశ్వరరావు

ఆసనములు మన పూర్వీకులచే కేవలము ఆధ్యాత్మిక సాధనకొరకే కాకుండా శరీరారోగ్యసాధనాది ప్రయోజనములు దృష్టియందిడుకొని కనిపెట్టబడి, ఆచరింపబడుచుండినవి. విదేశస్థులు సైతము ఆసనములవలని యుపయోగములు గుర్తెరింగి తాము స్వయముగా నాచరించుటద్వారా కల్గిన శారీరక మానసికారోగ్య ఆనందములకు అచ్చెరువడి యిట్టి యుత్కృష్ట సాధనలను కనుపెట్టిన మనపూర్వుల నైపుణ్యమును వేనోళ్ళ శ్లాఘించుచున్నారు. అనేకములయిన సమకాలిక వ్యాధుల నిర్మూలించుటయందును, శరీరమునకు బల, వీర్య, తేజస్సుల నొసంగుటయందును ఆసనము లత్యంత ప్రాముఖ్యత గలవని చెప్పుట నిర్వివాదాంశం. శరీరమునందు జరుగు సర్వవ్యాపారములను క్రమముగా జరిపించుటయందును, బలవీర్య తేజస్సుల నొసంగుటయందును, ఆసనములెట్లు ఉపయోగపడును ?

మన శరీరమందలి సర్వాంగములును, టిస్యూలనబడు జీవకణములచే నిర్మింపబడినవి. మన శరీర ఆరోగ్యమెల్లప్పుడును యీ టిస్యూలపై నాధారపడియుండును. ఈ టిస్యూలు ఆరోగ్యముగా నున్నచో శరీరమందలి సర్వావయవములును ఆరోగ్యవంతములుగాను, బలిష్టములుగాను నుండును, కావున మన శరీరారోగ్యసంరక్షణకు టిస్యూలను ఆరోగ్యముగా నుంచుట మిక్కిలి యవసరము, అందుచే టిస్యూలకు కావలసిన పోషక పదార్థములు అనగా క్రొవ్వు పదార్థములు, మాంసకృత్తులు, లవణములు, విటమినులు. ప్రాణవాయువు సక్రమముగా అందించబడుచుండవలెను. ప్రాణవాయువు దక్క తక్కిన పోషకపదార్థములను టిస్యూలకు సక్రమముగా అందజేయవలెననిన జీర్ణక్రియ, రక్తప్రసరణ క్రియలు సక్రమముగా జరుగవలసి యుండును. పైన జెప్పబడిన రెండు క్రియలు సరిగా జరుగుటకు ఆసనములు తోడ్పడును.

జీర్ణాశయపు కండరములు ఎల్లప్పుడూ పైకి క్రిందికి సంచలించుచుండుటవలనను, గాలి పీల్చునప్పుడూ, వదలునప్పుడూ విభాజకము (Diaphragm) యొక్క సంచలన వలన జీర్ణాశయముపై గల్గు ఒత్తిడిమూలముననూ జీర్ణాశయమందలి గ్రంథులవలననూ ఆహారం సులభముగా జీర్ణమగుచున్నది. కావున జీర్ణక్రియ సక్రమముగా జరుగవలెననిన జీర్ణాశయపు కండరములు బలిష్టములుగా నుండుట, విభాజకము బలిష్టముగా నుండుట, జీర్ణాశయపు గ్రంథులు సక్రమముగా రసములను ఊరి జీర్ణశక్తికి తోడ్పడుట అవసరము. పైమూడును సరిగా పనిచేయనిచో అజీర్ణము, అగ్నిమాంద్యం మొదలగు రోగములు సంభవించును. కాని ఆసనములు పైనజెప్పబడిన మూడు పరిస్థితులను సమకూర్చి జీర్ణాశయమందలి సర్వాంగములకును నవ్యశక్తిని, పుష్టిని కల్గించగలవు. ఇందుకు భుజంగాసనము, శలభాసనము, ధనురాసనము, హలాసనములు సమర్థములైనవి.


జీర్ణక్రియయైన తర్వాత జీర్ణమైన పోషక పదార్థములను టిస్యూలకుఅందజేయుటయందు రక్తప్రసరణక్రియయొక్క బాధ్యతను గురించి విచారింతము. రక్తప్రసరణ వ్యాపారమును నడపు ముఖ్యాంగము గుండె. ఇది మిక్కిలి బలిష్టములైన కండరములచే నిర్మించబడినది. ఈకండరములు ఆరోగ్యముగానున్న యెడల రక్తప్రసరణ వ్యాపారము సక్రమముగా జరుగును. వీటిని ఆరోగ్యముగా నుంచుటకు భుజంగాసనము, శలభాసనము, ధనురాసనము సమర్థములై యున్నవి. అదిగాక రక్తప్రసరణ వ్యాపారము జరుపు అంగములన్నిటిలో శిరలు (Veins) మిగుల బలహీనమైనవి. ఇవి శరీరమునందన్ని భాగములనుండి చెడురక్తమును ప్రోగుచేసి గుండెకు కొనిపోవలసి యుండును. ఇది చాలా కష్టసాధ్యమైన పని యగుటచే వీటికి కొంత విశ్రాంతి యవసరము. శిరలకు అట్టి విశ్రాంతి శీర్షాసనము, సర్వాంగాసనములందు లభించును. ఈ యాసనములు వేయునప్పుడు శరీరము తలక్రిందులుగా నుండుటవలన శిరల యొక్క ప్రయత్నము లేకయే శరీరమందన్ని భాగములనుండియు రక్తము గుండెకు చేరుచుండును. ఈ యాసనము లొనరించునపుడు శిరలకు కల్గిన స్వల్ప విరామమే అవి శరీరమునకు అమోఘమైన యుపకారము చేయుటకు తోడ్పడును.

ఇక టిస్యూలకు కావలసిన ప్రాణవాయువు (Oxygen) ను సక్రమముగా అందించుటయందు వాయుప్రసరణ మండలమునకుగల బాధ్యతను గురించియు, ఈ క్రియను నిర్వహించుటకు ఆసనములెలా తోడ్పడునదియు విచారింతము. వాయు ప్రసరణ వ్యాపారమునకు ముఖ్యకేంద్రము ఊపిరితిత్తులు. సాధారణముగా ఊపిరితిత్తులయొక్క ఆరోగ్యము వాటి యందలి అసంఖ్యాకములైన వాయుగోళములపై నాధారపడి యుండును, మరియు ఊపిరితిత్తులపై కండరములు బలిష్ఠంగా నుండుట; వాయునాళముయొక్క ద్వారము పరిశుభ్రముగా నుండుట అవసరము. శలభాసనము ఊపిరితిత్తులలోని వాయుగోళము లన్నియు పరిశుభ్రమైన ప్రాణవాయువుతో నింపబడునట్లు చేయగలదు. శలభాసనము ఊపిరితిత్తులపైని కండరములు మిగుల బలిష్ఠముగా నుండునట్లు చేయును. వాయునాళమునందు తరచుగా కొయ్యగండలు, దగ్గు, కళ్ళె, రొంప మొదలగు వ్యాధులవలన పీల్చు గాలి ధారాళముగా లోనికిపోవుటకు ఆటంకము కలుగును. సర్వాంగాసనము, మత్యాసనము ఈ వ్యాధులను సులభముగా అరికట్టగలవు.

ఈ విధముగా శరీరారోగ్య నిర్మాణ ప్రధానములగు టిస్యూలకు కావలసిన పోషక పదార్థములను సక్రమముగా అందింపజేయుటలో ఆసనములు తోడ్పడును. మన శరీరమందు, ప్రాముఖ్యతగల వాహికారవాత గ్రంథులు సరిగా పనిచేయకున్నచో అనేక ప్రమాదకరమైన వ్యాధులు సంభవించును. ఈ గ్రంథులలో ముఖ్యమైనవి థైర్యాయిడ్, పేరాథైరాయిడ్ గ్రంథులు (ఇవి మెడయందుగలవు). పీనియల్ పిట్యూటరీ గ్రంథులు (ఇవి మెదడు యొక్క మూలమందును, మెదడునందునూ గలవు) ఎడ్రినాల్సు (ఇవి మూత్రపిండముల పైభాగమున గలవు) థైరాయిడ్ గ్రంథి

యొక్క ప్రాముఖ్యత అత్యంతమైనది. ఈ గ్రంధి సరిగా పనిచేయకున్న రక్తక్షీణము: కృశించుకొనిపోవుట: నపుంసకత్వము మొద లగు ప్రమాదకరవ్యాధులు సంభవించును. పిట్యూటరీ గ్రంధి సరిగా పనిచేయకున్నచో మతి చాంచల్యము, పిచ్చి దృష్టిదోషము మొద లగు వ్యాధులు సంభవించును. కావున యీ గ్రంధులు ఆరోగ్యముగా నుండుట అత్యం తావశ్యకము. ఇందులకు సర్వాంగాసనము: శీర్షాసనము ఉద్యానబంధము: మత్స్యాసనము సమర్ధములయినవి.

అదియునుంగాక టిస్యూలయొక్క పోష ణకు పోషకపదార్ధములెట్లు సక్రమముగా అందింపబడవలెనో అటులే మలినపదార్ధము



సర్వాంగాసనము

లును సక్రమముగా విసర్జింపబడవలెను శరీ రమునందుగల మలినపదార్ధములను విసర్జించు టలో ఊపిరితిత్తులు, మూత్రపిండములు ప్రధాన బాధ్యత వహించగలవు. మూత్రపిండ ములు సక్రమముగా పని చేయవలెననిన మయూరాసనము, శలభాసనము మిక్కిలి తోడ్పడగలవు. మలము సక్రమముగా విస ర్జింపబడవలెననిన పెద్ద ప్రేవులలో కదలిక శక్తియు. జారుడు శక్తియు క్రమముగా నుండ వలెను. లేనియెడల మలబద్ధముసంభవించును మయూరాసనము మలబద్ధమును నిర్మూలించు టయేగాక ప్రేవులయందలి కదలిక శక్తిని పున రుజ్జీవింప జేయును. ఇక మన శరీరమందలి నాడీమండలము: శరీరమందలి సర్వనాడులకు కేంద్రస్థానము మెదడు. ఇచ్చట నుండియే సర్వాంగములకు ఆజ్ఞలు కొనిపో బడును. శరీరమందే భాగమందైన ఆభాగము నకు సంబంధించిన నాడులు పనిచేయకున్న శరీరమందాభాగమంతయు పనిచేయుటకు నిర ర్ధకమై పోవును కావున యీ నాడులకెంత ప్రాధాన్యత గలదో గ్రహించ వచ్చును శీర్షా సనము, సర్వాంగాసనము, మయూర, శలభా సనములు మెదడునకును తద్వారా సర్వనాడు లకును రక్తము పుష్కలముగాప్రసరించునట్లు జేసి, సర్వనాడులు సక్రమముగా పనిచేయుటకు కావలసిన శక్తిని పుష్టిని యిచ్చును.

శరీరావయవ నిర్మాణ ప్రధానములైన టిస్యూలయొక్క ప్రాముఖ్యతను గూర్చియు, ఇవి ఆరోగ్యముగా నుండుటకు అవసరమైన పరిస్థితులు అపరిస్థితులను సమకూర్చుటయందా సనము లెలాతోడ్పడునది వివరించబడినది. మరునటిసంచికలో ఆసనములువేయు పద్ధతులు ఫోటోలు, ఒక్కొక్క ఆసనముయొక్క ప్రత్యేక ప్రాముఖ్యతలను గురించి వివరించ బడును

★

బాల బాలికలకు

ఆటలు పాటలు కావాలి

యువజనసంఘ ఆధ్వర్యమున బాల బాలిక లకు "ఆటలు" "పాటలు" పుస్తక రూప మున తీసుకరావాలని ప్రయత్నిస్తున్నాం. రచ యితలందరూ బాలబాలికలకు పాడుకోటానికి వీలుగాఉండే పాటలను వ్రాసి పంపమని కోరు తున్నాం. ఉద్యమ అభిమానులందరూ తమకు తెలిసిన పిల్లల ఆటలనుగూర్చి బొమ్మలతో సహా వెంటనే వ్రాసి పంపాలని కోరుతున్నాం. సెప్టెంబరు 15 వ తేదీలోగా జిల్లాయువజన సంఘ ఆఫీసు, మెయిన్‌రోడ్డు, కొత్తపేట గుంటూరుకు పంపాలి.

షరా.—ప్రచురించే అన్నిపాటలకు మా శక్తి ననుసరించి పారితోషికములు ఇచ్చెదము,

ఇట్లు

గుంటూరు }
21-8-47 }

యం. వి. సుబ్బారావు
ఆర్గనైజర్
జిల్లాయువజనసంఘం, గుంటూరు

గుంటూరు తాలూకా యువజన మహాసభ

★

19 వ తేదీఉదయంఅయేసరికి తాడికొండ గ్రామం అంతా కళకళలాడుతూ ఉంది అన్ని ప్రదేశాలమంచి ప్రతినిధులు, ప్రేక్షకులు, అనేక మంది వచ్చారు. ఆటల పోటీలు ప్రారంభింప బడ్డాయి. 100 మంది యువకులు పోటీలలో పాల్గొన్నారు. 13 చెడుగుడు టీములు, అత్య ద్భుతముగా తమ నేర్పును ప్రదర్శించాయి. పోటీలలో, కాంగ్రెసు, కమ్యూనిస్టు భేదాలు లేకుండా పాల్గొనటం, ఇంతమంది యువకులు పాల్గొనటం ఇదే ప్రధమ పర్యాయం. పోటీ లను 2000 మంది ప్రజలు చూచి, ప్రదర్శకు లను ఉత్సాహవంతులుగాచేశారు. 19 వ తేదీ రాత్రి బుర్రకథలు, పోటీలు జరిగాయి. 5000 ప్రజలు పోటీలనుచూచి, ప్రదర్శకుల నైపు ణ్యాన్ని ప్రశంసించారు. అయిదు బుర్రకథ దళాలు పోటీలో పాల్గొన్నాయి. 20 వ తేది సాయంకాలం 400 మందితో బ్రహ్మాండమైన ఊరేగింపు జరిగింది. నవయుగ సంపాదకులు కోటేశ్వరరావుగారు జండా ప్రతిష్టాపనచేశారు. ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ అధ్యక్షులు జి. జగన్నాధరెడ్డిగారు మహాసభకు అధ్యక్షత వహించారు జిల్లా యువజనసంఘ అధ్యక్షులు కాసరనేని కోటేశ్వరరావుగారు సభను ప్రారం భించారు శ్రీ మాధవపెద్ది వెంకట్రామయ్య గారు యువకులను ఉద్బోధిస్తూ, మన జాతి నిర్వీర్యమవుతోన్నదని, దానిని యువకులం దరూ, ఆరోగ్యవంతులుగాను, బలవంతులు గాను విజ్ఞానవంతులుగాను అయి పునరుద్ధరిం చాలని. చెప్పారు.అధ్యక్షులు,యువకులు ప్రజలు అందరూ ఏ అరమరలేక ఐక్యతతో ప్రవర్తిం చాలని, ఐక్యయువజన ఉద్యమాన్ని నిర్మించా లని విజ్ఞప్తి చేశారు. తర్వాత పైపంట నాటిక పోటీలు జరిగాయి. గెలుపొందిన వారికి బహు మతులు పంచిపెట్టినతర్వాత జయ జయ వినా దాలతో మహాసభ జయ ప్రదంగా ముగిసింది.

ప్రతినిధుల సమావేశంలో శేషారావుగారిని అధ్యక్షులుగాను, గుర్రంసత్యంగారిని కార్యదర్శి గాను ఎన్నుకొన్నారు.—

★

పిల్లల మంకుపట్టును పోగొట్టుట యెట్లు?

★

డాక్టరు. లక్ష్మి, యం. బి., బి. యస్.,

కృష్ణాజిల్లా, మైలవరంనుండి శ్రీమతి చుండి సత్యవతిగారు వారిని ఎదుర్కొనిన రెండు సమస్యలను వ్రాశారు. ఆ ప్రశ్నలను క్రింద యిస్తున్నాం.

1. మా అమ్మాయికి ఇంకో నెలకు ఆరో ఏడు వస్తుంది ఏదయినా పట్టుపట్టిందంటె అది నెరవేరేదాకా ఏడుపు మానదు ఏంచేయాలి?

2. తండ్రిగారినిగాని, నన్నుగాని వదలి యుండదు బడిలోకి పంపుదామంటే ఒక్కతే వుండదు. ఒక అరగంట అయినా ఒకచోట కూర్చొని అక్షరాలు దిద్దదు. ఈ స్వభావం పోగొట్టి విద్య నివ్వడానికి మార్గమేమిటి?

వీటి పరిష్కార మార్గమేమిటి?

మనకుకావలసిన పద్ధతులలో తయారగుటకు పిల్లలకు నిపుణతతో శిక్షణ యిచ్చుటకు బదులు పిల్లల యిష్టాయిష్టాలకు లొంగిపోయి చంచలములైన వారి కోరికలకు బానిసలుగా తయారగుటవలన వచ్చే దుష్ఫలితాలపైని ఉదహరించిన రెండుప్రశ్నలలోను గోచరిస్తుంది: ఆరు సంవత్సరములు వచ్చినాక పోగొట్టడానికి ప్రయత్నించడంకన్న యీదురభ్యాసాలు ఏ విధంగా ఏర్పడింది అని ఒక్కసారి ఆలోచించుకుంటే అది ఆ పిల్లల పరిసరాలలోఉన్న పెద్దల ప్రవర్తనలోపమనియేఅర్ధమవుతున్నది. చూసిన ప్రతివస్తువూ కావాలనడం పిల్లలకు సహజం. అదివారి కివ్వవచ్చునా లేదా అని ఆలోచించవలసింది తల్లిదండ్రులు పిల్లలడిగింది యివ్వ తలచుకున్నపుడు వారినేడ్పించకుండా ముందుగానే యిచ్చివేయవలెను ఒకసారి యివ్వను అన్న తర్వాత పిల్లలెంతపోరుపెట్టి ఏడ్చినను సరే ఆవస్తువు నివ్వకూడదు కోరిన వస్తువు దొరకకపోగానే పిల్లలేడ్చుట సహజం. ఆఏడ్పులనుచూచి కరిగిపోయి పిల్లఎక్కడ కంది పోతుందో అన్నభయంచేత గాభరాచేత ముద్దుచేత కొంతకాలం ఏడ్చినతరువాత ఆ ఏడ్పును మాన్పించుటకు కోరిన వస్తువు నిస్తారు. ఇదే పిల్లలకు దురభ్యాసములు నేర్పుటలో తల్లిదండ్రుల పొరపాటు. "మనం గంటల కొద్దీ పోరుపెట్టి ఏడిస్తేసరి. మన కోరిన వస్తువు వస్తుంది" అనే భావం పిల్లలమనస్సులో కలిగిస్తారు. అదిలోకువగా చేసుకొని తామకోరిన వస్తువును సంపాదించటానికి ఒకఆయుధంగా ఏడ్పును ఉపయోగిస్తారు, ఒకసారి తల్లి యీ ఏడ్పునకు లొంగిన యెడల ప్రతీసారి ఆఏడ్పు మరింత విజృంభిస్తుంది ఒకసారి యివ్వను అనిన తరువాత ఆ వస్తువునుఇవ్వకూడదు. పసిబిడ్డలఏడ్పునకు లొంగిపోకుండా తల్లిదండ్రులకు మనోనిబ్బరము, కరుకుతనం, సహనం



ఉండాలి. గారాబంగా పెంచుకుంటున్నామని వారి యేడ్పులకు లొంగిపోయి పిల్లలను చెడగొట్టకూడదు. పెద్దల స్వభావంలోని యీ లోపమే పిల్లల దురభ్యాసములకు కారణం.

ఇంతేకాకుండా మనయిళ్ళలోని ముసలమ్మలకు మరియొక చెడు అలవాటుంది, తల్లి కసిరిన పిల్లలను వారు తీసుకెళ్ళి సముదాయించి వారి కోర్కెలను నెరవేరుస్తారు. తల్లిదండ్రులకన్న ఎక్కువప్రేమతో ఆదరిస్తున్నామని వారి భావన అయియుంటుంది కాని ఏడిస్తే ఇంట్లో యెవరో ఒకరు తనకోరిన వస్తువు యిస్తారనే ధీమా పిల్లలమనస్సులో యేర్పడుతుంది. పిల్లలయెడ ప్రవర్తన విషయంలో యింటి యందలి పెద్దలందరు ఒకేమాటమీదయుండాలి. ఒకరు విషేధించిన తరువాత మరియెవ్వరూ ఆ వస్తువును పిల్లలకియ్యకూడదు.

ఈ విధంగా కరుకుతనంతో తల్లిదండ్రులు ప్రవర్తించినచో ఎంతఏడ్చినా లాభంలేదనే విషయం గ్రహించి ఒకసారి యివ్వను అన్న తరువాత ఏడ్వడం మానేస్తారు. తల్లిదండ్రుల మాటలయందు గౌరవము ఏర్పడుతుంది. వారు చెప్పినట్లల్లా వింటారు.

చదువునేర్పేపద్ధతి

రెండవ ప్రశ్నలో రెండు సమస్యలున్నాయి. మొదటిది తలిదండ్రులను విడిచియుండక పోవడం, రెండవది చదువుయందు అభిలాష లేకపోవడం.

ఏడాది వయస్సు దాటినప్పటినుండి ఇతర పిల్లలతో కలసి ఆడుకునే అలవాటు పిల్లలకు నేర్పించాలి, తన వెనకాలే కొంగుపట్టుకొని తిరిగే అభ్యాసాన్ని అరికట్టాలి. ఇంట్లో పెద్ద పిల్లల నెవ్వరినైన తోడిచ్చి ఆడుకునేందుకు పంపేయాలి. ఆటల ధోరణిలోపడి తల్లిదండ్రులను మరచేటట్టుచేయాలి ఈ విధంగా కలుపుగోలుతనమును యితరపిల్లలతో సహవాసము చేయుటఅలవడుతాయి. ఇంతేకాకుండా పిల్లల కాలమును వారి స్వంతవ్యాపకాలతో వినియోగించుకునేటట్లు చూడాలి. దీనికి తల్లిదండ్రులు సహాయం చెయ్యాలి. ప్రతి పిల్లకి సహజంగా ఏదో ఒకదానిమీద (Hobby) అభిరుచి ఉంటుంది ఆ అభిరుచిని గుర్తించితల్లి ప్రోత్సహించాలి. ఈ వ్యాపకదృష్టిలోపడి తల్లిదండ్రులను మరచి తిరుగ గలుగుతారు.

ఈ ప్రత్యేకసందర్భములో వయస్సు ముదిరిందిగనుక తల్లేదగ్గరఉండి తదితర పిల్లలతో ఆడుకోడం నేర్పించాలి అవసరమున్నయెడల ఆమెకూడ ఆటలలో పాల్గొని ఆటలయందు అభిలాష కల్పించాలి, ఆటల ధోరణిలోపడి తల్లిదండ్రులను మరిచిపోగల్గుతారు ఇతర పిల్లలతో స్నేహంచేయడం జరుగుతుంది.

ఇంక చదువువిషయం కొట్టి తిట్టి భయాన పిల్లలకు చదువునేర్పడం చాలాకష్టమైన పని. ఒక మూలకూర్చుని అక్షరాలు దిద్దమంటే, పట్టుపట్టి ఏడ్చిసాధించడం నేర్చుకొన్న పిల్లలు

(మిగతా వ పేజీలో)

ఆంధ్ర విద్యార్థి, యువకులు

ఊరూరా స్వాతంత్ర్య జ్యోతిని వెలిగించారు

ఆగస్టు 15 భారతావని చరిత్రలో నూతన స్వతంత్రాధ్యాయాన్ని సువర్ణాక్షరాలతో లిఖింప మొదలిడిన సుదినం, భారత ప్రజానీకం ఆనందాతి శయాలతో స్వాతంత్ర దినోత్సవం జరిపారు. స్వతంత్ర రణరంగణంలో సామ్రాజ్య వాద కరకుకత్తులకు తమ వీరరక్తాన్ని బలిదానం చేసిన వీరయోధులకు జోహార్లు అర్పించారు. స్వతంత్ర పోరాటంలో సాటిలేని ధైర్య పటిమలను ప్రదర్శించిన ఆంధ్ర యువక, విద్యార్థి లోకం కదిలింది. ఆటల కార్యక్రమాలతోను, దేశభక్తిని ఉద్దీపింపచేసే వైజ్ఞానిక కార్యక్రమాలతోను, స్వతంత్ర పర్వదినానికి నూతన శోభను చేకూర్చింది విద్యార్థి ఫెడరేషన్, కాంగ్రెసు విద్యార్థులు, అన్నివర్గాలకు వర్ణాలకు చెందిన యువకులను, ప్రజలను స్వతంత్రోత్సవంలో ఐక్యపరిచి భవిష్యత్‌కు వెలుగు జాడలను చూపింది

గెలుపు విద్యార్థినులదే

ఆగస్టు 15న గుంటూరు పట్టణమంతా నూతనాలంకారాలతో, ప్రజల కోలాహల ధ్వనులతో నిండిపోయింది 'విజయోత్సవ సంఘ' ఆధ్వర్యాన ప్రభాతభేరీలు, పలుప్రదేశాలలో జెండాప్రతిష్ఠాపనాకార్యక్రమాలు నడిచాయి.

విద్యాలయాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు విజయోత్సవం జరిపారు. మెడికల్ కాలేజీలో మోకులాగుట, ఫుట్‌బాల్ సైకిల్ త్రొక్కుట మొదలైన ఆటలు ఆడించారు. స్త్రీ విద్యార్థులు, లెక్చరర్లు, మోకులాగే పోటీలలో పాల్గొన్నారు గెలుపు విద్యార్థినులదే. పురుషులకన్న స్త్రీలు ఎందులోనూ తీసిపోరనే విషయాన్ని రుజువు పరిచారు. మొత్తం 75 మంది (100కి) ఆటలలో పాల్గొన్నారు. కాలేజీలలో టీ పార్టీ, మీటింగులు జెండా వందనము జరిపారు. ఎ. సి, కాలేజీలోకూడ ఆటల పోటీలు జరిగినాయి. ఎ. సి. కాలేజీ ఆవరణలో వృత్తాకారంలో విద్యార్థులకు సీట్లు అమర్చారు. ఉదయాన క్రిష్టియన్, హిందూ కాలేజీల విద్యార్థులు బ్రహ్మాండమైన ఊరేగింపులు వేరు. వేరుగా జరిపినారు, కాలేజీ ప్రిన్సిపాళ్ళు జెండా ప్రతిష్ఠాపనలు చేశారు. హిందూకాలేజీ విద్యార్థులు రాత్రికి "ముక్తి" నాటకం ప్రదర్శించారు. స్వరాజ్ మైదానంలో విద్యార్థి ఫెడరేషన్, క్విట్ కాశ్మీర్, సి. పి. దర్బారు, పైపంట' లు ప్రదర్శించి ప్రజల మన్ననలను పొందారు.

విద్యార్థులకు సైనికశిక్షణ అవసరం

అగస్టు 7 నుండి యీ వూరి విద్యార్థి ఫెడరేషన్ స్వాతంత్రదినోత్సవంలో ప్రభాతభేరీలు జరిపారు. జాతీయక్రీడలైన, కాకో్కి, చెడుగుడు, బ్యాట్‌మెంటిన్, ఆటలపోటీలు జరిపారు హిందూ హాస్టల్‌లో బహిరంగసభ జరిగింది. కాంగ్రెసు - లీగు - విద్యార్థి ఫెడరేషన్ ప్రతినిధులు మాట్లాడారు. అనంతపురం జిల్లా కాంగ్రెసు నాయకుడు పప్పుకూరి రామాచార్లుగారు జాతీయజెండానుగురించి చెప్పి దేశరక్షణ కొరకు విద్యార్థులకు సైనిక శిక్షణ అవుసరమని ఉద్బోధించారు

యం. రామకృష్ణారావు

స్వతంత్రరధం కదిలింది

ఉప్పు గుండూరు యువకులు, బాలురు జాతీయ పతాకాలతో ప్రభాత పేరీలు జరిపి గ్రంధాలయంపైన ప్రజాసంఘ ఆఫీసులపైన జెండాలను ప్రతిష్టించారు, సాయంత్రం ఆకర్షణీయమైన అలంకారాలతో స్వతంత్రరధాన్ని 21 జతల ఎడ్లతో ఊరేగించి, బహిరంగసభ జరిపారు. శ్రీ అనంతలక్ష్మణాచార్యులుగారు ఈ స్వతంత్రాన్ని ఎలా ప్రజాభ్యుదయంకోసం ఉపయోగించాలో వివరించారు 'విప్లవ విజయం' నాటిక ప్రజానాట్యమండలివారు ప్రదర్శించారు.

విద్యార్థి ఐక్యత వర్ధిల్లాలి

కనిగిరి విద్యాలయాలలో ఉత్సవాలు జరిగినాయి. పట్టణంలో ఏర్పడిన ఐక్యకమిటీలో విద్యార్థికాంగ్రెసు, ఫెడరేషన్ కలిసిపనిచేశాయి 'స్వతంత్ర భారతంలో, స్వతంత్ర విద్యావిధానం కావాలి','విద్యార్థి ఐక్యత వర్ధిల్లాలి' అని దిక్కులు పిక్కటిల్లేటట్లు, నినాదాలు యిస్తూ అతి వైభవంతో జరిపారు. క్రైస్తవ యువజన సంఘంవారు కూడ చర్చివద్ద ఉత్సవం జరిపారు. యువకులకు ఆటలపోటీలు పెట్టారు. పట్టణ కమిటీతో కలిసి పనిచేశారు,

బందరు లేడీ ఆంఫితిల్ స్కూలు ఆవరణ జాతీయ నినాదాల ముగ్గులతోను, తోరణాలతోను ముచ్చట కల్గించేటట్లుగా అలంకరించబడింది 'జై జై, జాతీయ జెండా' మొదలగు ఉత్తేజకరమైన పాటలు సమిష్టిగా పాడి ప్రేక్షకులను ఉత్తేజ పూరితులను చేశారు.

రాజుగారి కిరీటానికి స్వస్తి

ఇంగ్లిషు దొరలు మూటా ముల్లె సర్దుకొని తట్టాబుట్టా ఓడల కెత్తబోయే రోజుల్లో, బంధితభారతజననిదాస్యశృంఖలాలు విచ్ఛేదమయ్యే శుభసమయంలో, కాకినాడ క్రౌన్ (ప్రభువుగారి కిరీటము) టాకీస్ మేనేజరులాంటివాళ్ళకు జార్జిరాజుమీద, రాజుగారి కిరీటంమీద వ్యామోహం తగ్గలేదు. అవి అలాగే సినిమాహాల్లో వున్నాయి

బ్రిటిషసామ్రాజ్యం పటాపంచలవుతూన్న ఈ సమయంలో ఇలాంటిపద్ధతుల్ని ఏస్వతంత్రాభిలాషీ సహించడు. కాకినాడ విద్యార్థులు అదేచేశారు, జార్జిరాజు పటమును తీసివేయమని కిరీటచిహ్నాన్ని చెరిపించమని ఐక్యాందోళన జరిపారు, విద్యార్థి ఐక్యకమిటీని నియమించి తీవ్రాందోళన సల్పారు. మేనేజరు చర్యను నిరసిస్తూ 3 వేలమంది విద్యార్థులతో డా॥ చలపతిరావుగారి అధ్యక్షతక్రింద బహిరంగసభ జరిగింది. చివరకు ఈ విషయంలో పట్టణంలోని పలువురు పెద్దలసాయంకూడాలభించింది. అంత్యంలో క్రౌన్‌టాకీస్ మేనేజరుకు జార్జి రాజు పటమును తీసివేయక తప్పిందికాదు, 15 వ తేదీనాటికి కిరీటచిహ్నాన్ని చెరిపించేందుకు నిశ్చయింపబడింది,

కొందరు విద్యార్థులను హింసించిన కారణాన మేనేజరు వ్రాతపూర్వకమైన క్షమాపణ పత్రాన్నికూడా అందజేశాడు.

'స్టూడెంట్‌యూనిటీ జిందాబాద్' నినాదం అగస్టు 9 న కాకినాడ ప్రతివీధిలో పిక్కటిల్లి ప్రతిధ్వనించింది.

★ దేశ పునర్నిర్మాణమునకు ఐక్య

విద్యార్థి కాంగ్రెస్ తీర్మానం

బ్రిటీషు ప్రభుత్వం రాజకీయ రాజ్యాంగ మార్పులపై చేసిన ప్రకటన ఫలితంగా ఉద్భవించిన నూతన పరిస్థితులను, విద్యార్థి కాంగ్రెసు కార్యవర్గ సమావేశం అతిశ్రద్ధగా పరిశీలించింది. ఆ ప్రకటన ఫలితంగా, పాత పరిస్థితులస్థానే వినూత్న తీవ్రసమస్యలు ఏర్పడ్డాయి. బ్రిటీషుప్రభుత్వ పరిపాలన అంతమై అంతర్జాతీయ రాజకీయాల్లో ఒక క్రొత్త స్థానాన్ని మనజాతి సంపాదించుకోడంవల్ల ఇకనుండి మనజాతి భవిష్యత్తును మనమే నిర్ణయించుకోవలసిన బాధ్యత మన భుజస్కంధములపై బడింది. అందువల్ల మన విద్యార్థి ఉద్యమానికి సంబంధించిన ప్రాథమిక విషయాలను, విద్యార్థులు తిరిగి చర్చించ వలసిన సమయంవచ్చింది సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటసమస్యలనుండి, జాతీయఐక్యతను దృఢతరంచేయడానికి, కృషిచేయడంద్వారా, జాతీయపునర్నిర్మాణానికి మనదృష్టిని మరల్చ వలసిన సమయం వచ్చింది దేశములోని అజ్ఞానాన్ని నిరక్షరాశ్యతను, సాంఘిక ఛాందసాన్ని రూపుమాపవలసిన సమయంవచ్చింది. వీటన్నిటినీమించి ఆర్థిక సమానతకొఱకు రాజకీయ ప్రజాస్వామ్యనం కొఱకు కృషిచేయవలసిన సమయం వచ్చిందని ఈ సమావేశం భావించుచున్నది ఈ విధంగా సామ్రాజ్యవాద వ్యతిరేకపోరాట కార్యక్రమాన్నుండి, దేశ సౌభాగ్య పునర్నిర్మాణానికి కృషిచేయవలసిన ఆవశ్యకత ఏర్పడింది అందువల్ల విద్యార్థి ఉద్యమాన్ని వెంటనే, సరిక్రొత్త పునాదులపై నిర్మించుకొనుటకు కార్యక్రమం ఇవ్వవలసిన అవుసరం ఎంతో ఉన్నదని ఈ కార్యవర్గము భావించుచున్నది

ఈ నూతన ఉద్యమం, స్వతంత్రభారతావనిలో స్వతంత్రవిద్యార్థుల జాతీయోద్యమంగా ఉండాలని ఈ కార్యవర్గము విశ్వసిస్తున్నది ఒక శక్తివంతమైన ప్రజాస్వామిక జాతిని నిర్మించవలసిన బాధ్యత, అన్నిపక్షాలకుచెందిన విద్యార్థులమీద ఉందని మేము నమ్ముతున్నాం. ఈ నూతన బాధ్యతను విజయవంతంగా నిర్వర్తించడానికి, అన్నిపక్షాల భారతవిద్యార్థుల సహకారము అవసరమని భావించుతున్నాం అందుకుగాను ఐక్యవిద్యార్థి ఉద్యమ నిర్మాణమే ప్రాతిపదికగా చర్చించి, నిర్ణయాలకు వచ్చుటకుగాను రాజకీయాల, సంఘాల విభేదములతో నిమిత్తం లేకుండా విద్యార్థులందరిని (National Convention) నేషనల్‌కన్‌వెన్షన్‌కు ఆహ్వానిస్తున్నాం.

ఈ గురుతర బాధ్యతనునెరవేర్చుటకు కావలసిన ఐక్యతావసరాన్ని ఈకార్యవర్గం గుర్తిస్తూ, విద్యార్థి సంస్థలన్నింటికీ క్రింది విజ్ఞప్తిని చేస్తున్నది ఈ సమావేశాన్ని (కన్‌వెన్‌షన్) అఖిల భారత విద్యార్థి కాంగ్రెసు మహాసభగా భావించవద్దని కోరుతున్నాం. విద్యార్థి ఉద్యమాన్ని, పునర్నిర్మించవలసిన ఆవశ్యకతను గుర్తిస్తూ, మన జాతీయ అభ్యున్నతికై విద్యార్థులు నిర్వహించవలసిన వీరోచిత పాత్రను గుర్తిస్తూ, భారత విద్యార్థులు జరుపుకొనే జాతీయ సమాఖ్య (కన్‌వెన్‌షన్)గా భావించాలని, సోదర భారత విద్యార్థి సంస్థలన్నింటికీ విజ్ఞప్తి చేస్తున్నాం కొబట్టి మన గతవిభేదాలను మరచి సోదర విద్యార్థి సంస్థలన్నీ జాతీయ కన్‌వెన్‌షన్‌లో తమ పూర్తి బాధ్యతను నిర్వహించి ఉద్యమ అభ్యున్నతికై పాటుపడ వలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

ఈ నేషనల్ కన్‌వెన్‌షన్‌ను ఈ సంవత్సరం సెప్టెంబరు, లేక నవంబరు నెలల్లో జరపాలనీ, ఈ లోపున అందుకవసరమైన సంప్రదింపులు జరిపి, వచ్చే ఈకార్యనిర్వాహక వర్గసమావేశంలో ఒక నివేదికనిచ్చుటకు అధ్యక్షునికి అధికార మివ్వడమైనది.

విద్యార్థి కాంగ్రెస్

200 సం॥ లుగా భారత ప్రజానీకాన్ని పీల్చిపిప్పి చేసిన సామ్రాజ్యవాదం మూటాముల్లె కట్టుకుపోతూంది. కాని తన శుక్రాచార్యుని ప్రయత్నము మాత్రం మానలేదు భారత పెట్టుబడిదారులతో వ్యాపార సంధులు చేసుకొనుటద్వారాను, భారత యూనియన్-పాకిస్తాన్‌ల మధ్య భేదాలు రెచ్చగొట్టుటద్వారాను, తన తాబేదారులైన స్వదేశసంస్థానాధీశుల అండతోను, తన ప్రయత్నాలు కొనసాగించాలని పగటికలలు కంటూంది ఈ స్థితి లో భారతవిద్యార్థులపై మహత్తర బాధ్యతపడింది. బ్రిటీషుకుట్రలను భగ్నపరిచేందుకు, జాతీయ పునర్నిర్మాణ కార్యక్రమములో విద్యార్థుల మహత్తరబాధ్యత నెరవేర్చుటకు, బానిస విద్యావిధానాన్ని నిర్మూలించి ప్రజా విద్యావిధానాన్ని అమలు పర్చేందుకు, స్వతంత్ర భారత దేశములో ప్రతివారికీ తిండి, బట్ట, సుఖప్రదమైన జీవితము గడిపేందుకు ఐక్యవిద్యార్థి ఉద్యమం అత్యవసరం. ఈ సత్యాన్నిగుర్తించే, అఖిలభారత విద్యార్థికాంగ్రెసు. విద్యార్థి ఫెడరేషన్ కార్యవర్గాలుఐక్యవిద్యార్థి వుద్యమంపై యిచ్చట ప్రకటించిన తీర్మానాలు చేశాయి. ఈ తీర్మానాలకు ప్రతి ఆంధ్రవిద్యార్థీ సుస్వాగత మిస్తున్నాడు.

విద్యార్థి ఉద్యమంలో చీలికల మూలంగా వచ్చే దుష్ఫలితాలను విద్యార్థులు చవిచూచారు. మన చీలికలు ఆధారంగా చేసుకుని నిరంకుశ విద్యాలయాధికారులు మనపై విచ్చలవిడిగా నిర్బంధ విధానమును ప్రారంభించారు. అనేక విద్యార్థుల జీవితాలను నాశనంచేశారు. ఈ చీలికలతోవిద్యార్థులు విసుగెత్తిపోయారు.

విద్యార్థుల ఐక్యత ఒక్కటే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మార్గమని ఆంధ్ర విద్యార్థులు దృఢనిశ్చయులైనారు దాని పర్యవసానమే పోయిన సంవత్సరం మనము నడిపిన బ్రహ్మాండమైన ఐక్య విద్యార్థి పోరాటాలు. ఈ పోరాటాలను చూచి తల్లిదండ్రులు

విద్యార్థి ఉద్యమం అత్యవసరం

ఫెడరేషన్ విజ్ఞప్తి

మురిసిపోయి తమ బిడ్డలకండంగా నిలచారు. నిరంకుశ విద్యాలయాధికారులు నిర్ఘాంత పోయారు. ఐక్యసంఘ మెందుకుండరాదని విద్యార్థులు విద్యార్థి కాంగ్రెసు, విద్యార్థి ఫెడరేషన్‌లను ప్రశ్నించారు. ఈ సంవత్సరము అనేక ప్రదేశాలలో ఐక్యకార్యాచరణ సంఘాల నేర్పరచి విద్యార్థి సమస్యలపై పోరాటాన్ని సాగిస్తున్నారు. ఈ ఐక్య పోరాటాల మూలముగా విద్యార్థులలో యిదివరకున్న గుడ్డి ద్వేషాలు పశించి విపరీతమైన సౌభ్రాతృత్వమును పెంపొందించాయి.

ఈ రోజు విద్యార్థి తన విద్యను కొనసాగించుటే దుర్భరమవుతూన్నది. విపరీతమైన ఆర్థిక భారము. తిండి, బట్ట సరిగా దొరకదు పాఠశాలలలో చదువుకొనటానికి పుస్తకాలు, పరికరాలూ ఉండవు, ఉపాధ్యాయుల కొరత, వీనితోపాటు డిటెన్షను విధానము యింకఉండనే వున్నాయి. విద్యార్థులపై తీవ్రనిర్బంధ విధానము కొనసాగుతోంది. మన ప్రక్కనే, హైదరాబాదు సంస్థానంలో మన సోదరులపై నైజాం ప్రభుత్వం హింసాకాండ సాగిస్తూంది. ఆంధ్ర దేశంలో కరువు కాటకాలు కనుచూపుమేరలో వున్నాయి, డచ్చి, ఫ్రెంచి సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా ఇండోనేషియన్, వీట్-నామ్, ఫ్రెంచిఇండియా ప్రజలు సాగిస్తూన్న స్వతంత్ర పోరాటాల కండగా నిలబడాలి. కనుక వెంటనే పై తక్షణ బాధ్యతలను నిర్వర్తించేందుకు ఐక్యకార్యాచరణ సంఘాలను ఏర్పరచి, ఐక్య విద్యార్థి ఉద్యమానికి సోపానమైన ఐక్య విద్యార్థి పోరాటాలను నడుపుటకు ముందుకు రావలసినదిగా విద్యార్థి కాంగ్రెస్ సోదరులకు, విద్యార్థులకు విజ్ఞప్తి జేస్తున్నాం.

జి. జగన్నాథ రెడ్డి,
అధ్యక్షుడు.
ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్.

★

విద్యార్థి ఫెడరేషన్ తీర్మానం

సంఘటిత విద్యార్థి ఉద్యమాలకు చెందిన అన్ని పక్షాలతో కూడిన ఒక ఐక్య విద్యార్థి సంఘ నిర్మాణానికై అఖిలభారత విద్యార్థి కాంగ్రెసు కార్యవర్గం చేసిన ప్రతిపాదనలను అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ కార్యవర్గం హృదయ పూర్వకంగా ఆహ్వానిస్తున్నది.

మనదేశ చరిత్రలో యేర్పడిన అతిక్లిష్టమైన దశలో ఐక్య విద్యార్థి ఉద్యమావశ్యకత, ఇదివరకెన్నడూ లేనంతగా ఉన్నదని యీ సమావేశం నమ్ముతూంది. ఒక్క ఆశియాలోని విద్యార్థులేగాక ప్రపంచ విద్యార్థి లోకమంతా భారత విద్యార్థులపై ఆశలు పెట్టుకొనియుంది. భారత సంపూర్ణ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యాల కొఱకు జరిగే పోరాటంలో, సామ్రాజ్యవాద ప్రభావాలను 'మతకలహాలను' రూపుమాపటానికై జరిగేపోరాటంలో, సామ్రాజ్యవాదపాలన ఫలితంగా ఏర్పడిన దేశవిభజనను, బలహీనతలను ఎదుర్కొనుటకై జరిగే పోరాటంలో, న్యాయమైన కోర్కెల వెనుక సమీకరింపబడే ఐక్య విద్యార్థి ఉద్యమంద్వారానే, విద్యార్థులు తమ అమోఘమైన పాత్రను నిర్వహించగలుగుతారు. కార్మిక కర్షకుల న్యాయమైన కోర్కెలను ఐక్యవిద్యార్థి ఉద్యమం బలపర్చుట ద్వారా, ఉత్కృష్ట జీవితమునకై, కష్టజీవులు జరిపే పోరాటం బలపడుతుంది. శిథిలావస్థలోనున్న మన విద్యావిధాన పునర్నిర్మాణానికి, సత్వర విద్యావ్యాప్తికి, తదితర ప్రపంచ ప్రజాస్వామిక రాజ్యాలలోవలె, యువజనావళి అభివృద్ధికి విద్యార్థుల ఐక్యత ఒక్కటే మార్గం.

ఐక్య విద్యార్థి ఉద్యమ నిర్మాణానికై అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ సర్వదా కృషి చేస్తుంది. చివరకు ఐక్య విద్యార్థి ఉద్యమం నిర్మించగలమనే ధైర్యంతోనే, విద్యార్థి సమస్యలపై, అన్ని విద్యార్థి సంఘాల ఐక్యకమిటీల నిర్మాణానికీ చొరవతో కృషిసల్పింది. ఐక్య విద్యార్థి ఉద్యమం కనుచూపుమేరలో ఉన్నందుకు ఈ కమిటీ గర్విస్తున్నది. ఈ సమావేశం, అఖిలభారత విద్యార్థి కాంగ్రెసు సంఘ నిర్వాహక వర్గానికి, ఐక్యతను త్వరలో సాధించుటకై ఈ క్రింది కార్యక్రమమును ప్రతిపాదించుచున్నది.

1. (a) తిరువాన్కూరు, హైదరాబాదు, మొదలైన సంస్థాన ప్రజాపోరాటాలకు సానుభూతి, సహకారాలను అందచేయుటకు పూర్తి పౌరసత్వ హక్కులను నెలకొల్పుట, సామ్రాజ్యవాదవ్యతిరేక పోరాటంలో, వీరోచిత పాత్రవహిస్తూన్న ఇండొనేషియా, వీట్‌నామ్ ప్రజలను బలపరుచుట, ఉపాధ్యాయసమ్మెలను బలపరుచుట, జీతాల పెంపుదల మొదలైన తక్షణ విద్యార్థి సమస్యలను పరిష్కరించి కృషి చేయుట

(b) ప్రపంచ విద్యార్థి యువక మహాసభల లోను ముఖ్యంగా ఆసియా విద్యార్థి యువక మహాసభలలోను భారతయువకులు, తమవుచిత పాత్రను నిర్వర్తించునట్లు కృషిచేయుట.

(c) విద్యార్థి సమస్యలను, వారివారి, రాష్ట్ర సంస్థాన, విద్యాలయాధికార్ల దృష్టికి తెచ్చుట.

(1) ఈ పై కార్యక్రమాన్ని అమలు పరుచుటకు జిల్లా, రాష్ట్రాలవారిగాను, దేశవ్యాపితంగాను, వివిధ విద్యార్థి సంస్థల ప్రతినిధులతో కూడిన ఐక్యకమిటీలను తక్షణమే ఏర్పరచాలి.

(2) జరుగబోయే ఐక్యవిద్యార్థి సమాఖ్యను (నేషనల్ కన్వెన్షన్) జయప్రదంగా నిర్వర్తించుటకై, సూచనలను అందచేయుటకు, అన్ని విద్యార్థి సంఘాల ప్రతినిధులతో కూడిన ఒక తాత్కాలిక కమిటీని ఏర్పరచారు. ఈకమిటీయే నూతన విద్యార్థి వుద్యమ చిత్తునిర్మాణాన్ని సెప్టెంబరు నెలాఖరులోగా తయారు చెయ్యాలి. జరుగబోవు విద్యార్థి సమాఖ్య వివిధ విద్యార్థి సంస్థలను, వానిని బలపరచు సభ్యులను, ఐక్యపరచునట్లు చూచుట, ఈ ప్రాతినిధ్య కమిటీ యొక్క ప్రధాన బాధ్యతగా గుర్తించి అందుకు తగిన అన్ని ఏర్పాట్లనూ చెయ్యాలి. అన్ని విద్యార్థి సంస్థల కార్యనిర్వాహక సభలు, ఈ కమిటీయొక్క, సలహాకు అంగీకరించిన పిదప (కన్‌వెన్‌షన్) శీఘ్రంగా జరుపుటకు సహాయపడాలి.

బంగారం యెలా తయారౌతుంది!

కోలారు గనులలో అనుభవాలు


బంగారం చాల విలువయినది కాబట్టి ఒక దేశంయొక్క సౌభాగ్యం, ఉన్నతస్థాయి కొంత వరకు బంగారంపై ఆధారపడివుంటాయి. ఈ బంగారం ప్రకృతిలో ఎలా లభ్యమవుతోంది? దానికింత విలువ ఏలావచ్చింది? వీటిని తెల్సుకోడానికి ప్రతివారు కుతూహల పడుతూంటారు. మన దక్షిణ భారతదేశంలో బంగారం మైసూరు కోలారు గనుల్లో దొరుకుతుందని మనకందరికీతెలుసు. ఈ కోలారు జిల్లాలో ఈ బంగారు గనులు నాల్గున్నాయి. మా విజ్ఞాన యాత్రా సందర్భంలో నేనుచూచిన'నందిదుర్గం' అనే బంగారుగనిని గురించి ఇక్కడ ప్రస్తావిస్తాను.

ఈ 'నందిదుర్గం' ఊర్గాం అనే పట్టణంలో ఉంది. ఈ గనినిబట్టే ఊర్గాం పట్టణమయింది, ఎన్నో వేలమందికూలీలు నివసిస్తున్నారిక్కడ. విశాల ఆవరణలుగల్గిన యిండ్లున్నాయి. ఊర్గాం చక్కని వాతావరణంగల ప్రదేశం.

బంగారం ముడిపదార్థంగా రాయిరూపంలో దొరకుతుంది ప్రకృతిలో యీరాయి మన నల్ల కంకరరాయి మాదిరిగా ఉంటుంది. దానిపైన బంగారు రేణువులు మెరుస్తూంటాయి. ఏ ప్రదేశంలో యేరాయిలో ఇదిదొరుకుతుందో భూగర్భశాస్త్రజ్ఞులు పరిశీలించి, పరిశోధించి చెపుతూంటారు. ఎక్కడ దండిగా దొరకుతుందని తోస్తుందో అక్కడ త్రవ్వడం సాగిస్తారు.

మేముచూచిన 'నందిదుర్గం'గని 7000 అడుగులలోతు గలది. గనిలోనికి పోవడానికి, లోపల నుండి బయటకు రావడానికి విద్యుత్ వాహనాలు (ఎలక్ట్రిక్‌లిఫ్టు) ఎప్పుడూ పని చేస్తూంటాయి, ఇవి అమితవేగంతో ప్రయాణించేస్తాయి. మేము గనిలో 5000 అడుగులు లోనికి పోయిచూశాం, అంతదూరం ప్రయాణం చేయడానిక్కి రెండు నిముషాలుకూడ పట్టలేదంటే ఆ లిఫ్టులెంత వేగంగా నడుస్తాయో ఊహించుకోవచ్చు. వాటిల్లో ప్రయాణం చేస్తుంటే వింతఅనుభూతిని పొందుతాం. మనంపైకి పోతున్నామో క్రిందికి దిగుతున్నమో తెలియదు అంతాచీకటి, చలిగాలులు వీస్తూంటాయి, చెవులన్నీ దిబ్బడలు పడిపోతాయి.

ఈ విద్యుత్ వాహనాల నన్నింటినీ ఎక్కడో దూరాన కూర్చుని ఒక తెల్లమనిషి కంట్రోలు చేస్తూంటాడు. ఎప్పటి కప్పుడు టెలిఫోనుద్వారా వచ్చే వార్తలనుబట్టి ఎక్కడికి లిఫ్టుపంపాలో అక్కడికి సరిగా పంపుతుండడం అతడిపని. ఈ క్రింది బొమ్మనుచూడండి. చిట్ట చివర రెండు చక్రాలు, వాటిమీదుగా రెండు దారాలమాదిరిగా కనిపిస్తున్నాయి, అవి నిజంగా



కార్మికులను గనులలోకి తీసుకెళ్ళే యంత్రం

దారాలుకాదు, చిన్నచిన్న యినుపతీగలతో చుట్టిన యినుపత్రాళ్ళు. ఆ చక్రాలవల్ల, ఆత్రాళ్లవల్ల ఆలిఫ్టులు పైకీ క్రిందికీపోతూ వాటిపనిని సక్రమంగా నెరవేరుస్తూంటాయి.


తర్వాత గనిలోపల ఎలాగున్నదీ చూద్దాం. గనిలోపల కొండ తొలచి పెద్ద సొరంగాలు త్రవ్వినట్లుగా ఉంటుంది. నిజానికి అవన్నీ రాళ్లు తొలచి చేసిన సొరంగాలే। అక్కడ విద్యుత్ దీపాలు, నీటిపంపులు, టెలిఫోను సదుపాయాలు అన్నీ ఉన్నాయి. గనిలోపల మానవునికి సరిపడ ప్రాణవాయువులభ్యంకాదు, కాబట్టి

కొండేపూడి శ్రీనివాసరావు

ఎల్లప్పుడూ యంత్రాలద్వారా బయటనుండి గనిలోపలకు గాలి ప్రసరింప చేస్తూంటారు. లోపల రాయి త్రవ్వుతుంటారు. త్రవ్విన రాయి ఎప్పటికప్పుడు మోసుకొని పోవడానికి లోపల ట్రాలీలు నడుస్తూంటాయి. అంటే అవి నడవడానికి చిన్న ఇనుపదారులుకూడ ఆ సొరంగాల లోనే వేయబడ్డాయన్నమాట, గునపాలు పట్టుకొని కూలీలెప్పుడూ త్రవ్వుతూంటారు. ఒక్కొక్కప్పుడు ప్రేలుడు పదార్థాలు ప్రేలడం, లేదా విషవాయువులు, త్రవ్వుతూన్నప్పుడువస్తూండడం కద్దు. ఈలాంటి అపాయాలు గని అంతటికీ ప్రాకకుండా మధ్య మధ్య పెద్ద పెద్ద యినుప తలుపులుకూడ అమర్చబడినాయి. ఈలాంటి అపాయాలవల్ల సగటున రోజుకి ఒకకూలీ చనిపోతూంటాడని చెప్పారు. ఈ గనుల్లో పనిచేసే కూలీల వేషధారణవింతగా ఉంటుంది. ప్రతి కూలీకి నెత్తిన తట్టటోపీ విధాయికంగా ఉంటుంది. ఇది రాతిముక్కలు, దుమ్ము నెత్తిన పడకుండా అవుతుంది. అటుపైన చేతిలో ఎసిటిలీస్ దీపం తప్పదు, ఆ దీపం ఎసిటిలీస్ అనే వాయువువల్ల వెలుగుతూంటుంది. ఆ దీప సహాయంవల్ల గని అంతర్భాగాలలోనికి పోయి కూలీలు పనిచేస్తూంటారు. ఈరెండవఫొటోలో సామాన్యంగా గని కూలి యెలాఉంటాడో చూడవచ్చు

ఇక ఈరాయినుండి బంగారాన్ని ఎలావిడతీసేదీ పరిశీలిద్దాం. ముడిరాయిని గట్టిగా చితుక కొట్టి నీటితోకలపి పెద్దపెద్ద జల్లెళ్ళ మీదుగా ప్రవహింప చేస్తారు. కొన్నిబంగారు రేణువులు ఆ గుడ్డ జల్లెళ్ళపై దిగజారిపోతాయి. మిగతా ప్రవాహాన్నంతా పెద్దతొట్టెలలో (tanks) నిలువ చేస్తారు. బరువయిన పదార్థమంతా క్రిందికితెడ్డు లేక బురదమాదిరిగా క్రిందికి దిగజారిపోతుంది' అప్పుడు ఆపైనీటినంతా వదలివేసి, ఆఅడుగ్గున చేరిన పదార్థంలో నీరు, సోడియం, కార్బనేటు, సోడియం సైనైడ్ అనే రసాయనిక పదార్థాలు

కలుపుతారు, బంగారు రేణువులన్నీ సైనైడ్ ద్రావకంలో కరిగిపోతాయి. మిగతాపదార్థాలన్నీ మళ్ళీ క్రిందకి దిగజారిపోతాయి. దీనిని బాగా వడపోసి, ఆబంగారు సైనైడ్ ద్రావకాన్నిచిన్న తొట్టెలలో నిలువచేసిన సత్తుతీగెల గుండా (Zinc filings) నెమ్మదిగా ప్రవహింపచేస్తారు. రసాయనిక మార్పుల వల్ల బంగారమంతా ఆ సత్తుతీగెలపై పూతగా ఏర్పడుతుంది, అలా ఏర్పడిన సత్తుతీగెలనన్నిటినీ తీసి వాటిని ఉదజ అమ్లహరిదము (Hydrochloric Acid) లో కరిగిస్తారు, ఆసత్తుతీగెలన్నీ కరిగి ఉదజని అనే వాయువునిస్తాయి, బంగారంమాత్రం ఆ అమ్ల



కోలారు గనులలో పనిచేసే కార్మికుడు

ములో కరగదు. కాని దీనిలో చాల అన్యపదార్థాలుంటాయి. అందుచే ఈమాదిరిగా వచ్చినబంగారాన్ని మూసలలో బాగా ఎక్కువ ఉంపరేచరులో వేడిచేస్తారు. అన్యపదార్థాలన్నీ ఎగిరిపోతాయి. మేలైన మేలిమి మాత్రం మిలమిల మెరుస్తూ ద్రవరూపంలో మిగులుతుంది. దానినే కడ్డీలుగా అచ్చుపోస్తారు.

ఇంత పెద్దవిధానమంతా జరిగితేనేగానిమనకి బంగారంరాదు, ఒకటన్ను ముడిరాయిని త్రవ్వితే అందులో చివరకు లభ్యమయ్యే బంగారం ఆరు ఔన్సులు మాత్రమే ! అందుకే బంగారానికి అంతవిలువ.

*

బిగిలేసెయ్! ★

శ్రీ తెన్నేటిసూరి

విజిలేసెయ్ !
విజిలేసెయ్ !
గఁయ్యిఁమంటూ బిగిలేసెయ్ !
గఁయ్ఁయ్ఁయ్ఁయ్ఁ—*
విజిలేసెయ్ !
బిగిలేసెయ్ !
పూళ్ళోవాళ్ళని లేపేసెయ్ !
గఁయ్ఁ ... ...
విజిలేసెయ్ !
బిగిలేసెయ్ !
పిల్లాజల్లని కేకేసెయ్ !
గఁయ్ఁ ... ...
వచ్చారోయ్ !
వచ్చారోయ్ !
రాజూ రాడీ లొచ్చారోయ్ !
గఁయ్ఁ ... ...
వచ్చారోయ్ !
వచ్చారోయ్ !
లాఠీలుచ్చుకు వచ్చారోయ్ !
గఁయ్ఁ ... ...
తెచ్చారోయ్ !
తెచ్చారోయ్ !
తుపాకికట్టెలు తెచ్చారోయ్ !
గఁయ్ఁ ... ...
తెల్లాడోయ్ !
కుళ్ళాడోయ్ !
స్వాతంత్ర మిచ్చానన్నాడోయ్ !
గఁయ్ఁ ... ...
ఇచ్చాడోయ్ !
పిచ్చాడా !
తగూలు, మూఁకలు, ఇచ్చాడోయ్!
గఁయ్ఁ ... ...
పెచ్చారోయ్ !
పెచ్చారోయ్ !
రక్కసి రాజులు రెచ్చారోయ్ !
గఁయ్ఁ ... ...

హెచ్చారోయ్ !
హెచ్చారోయ్ !
చీకటి బేరపు చిడతల్లోయ్ !
గఁయ్ఁ ... ...
మత కలహాలూ,
మారణహోమం,
తెల్లాడన్నీ తెచ్చాడోయ్ !
గఁయ్ఁ ... ...
వచ్చిందోయ్ !
వచ్చిందోయ్ !
స్వాతంత్రమంతా వచ్చిందోయ్ !!
గఁయ్ఁ ... ...
వచ్చిందోయ్ !
వచ్చిందోయ్ !
సర్వ నాశనం వచ్చిందోయ్ !
గఁయ్ఁ ... ...
మానండోయ్ !
మానండోయ్ !
పదవులకోసం ఆరాటం
గఁయ్ఁ ... ...
పోరండోయ్ !
పోరండోయ్ !
కలిసీ మెలిసీ పోరండోయ్ !
గఁయ్ఁ ... ...
విజిలేసెయ్ !
విజిలేసెయ్ !
గఁయ్యిఁమంటూ బిగిలేసెయ్ !
గఁయ్ఁ ... ...
విజిలేసెయ్ !
బిగిలేసెయ్ !
పిల్లాజల్లని కేకేసెయ్ !
గఁయ్ఁ ... ...
గఁయ్ఁయ్ –
గఁయ్ఁయ్ –
గఁయ్ఁయ్ గఁయ్ఁయ్
గఁయ్ఁ ... ...

*"గఁయ్ఁయ్ఁయ్ఁయ్ఁ"—ఇలా వ్రాసివున్నచోటల్లా, తాళానికి సరిపోయేటట్లు చూసి, బిగిత్తుపాడండి.



విజ్ఞాన-విజయాలు

మానవుడు మరణాన్ని

విషాలవల్ల అకాల మృత్యువాత

మానవ లోకానికి పెద్ద శత్రువైన మరణాన్ని జయించడానికి సోవియట్ శాస్త్రవేత్తలు చేస్తున్న పరిశోధనలనుకొన్నిటిని క్రిందటిసంచికలో చూచాం. ఆ రహస్యపరిశోధనలోని మరికొన్ని సంగతులను గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

విషప్రయోగంవల్ల అకాల మృత్యువాతపడే ప్రాణుల్ని రక్షించడం ఎలాగ అనే సమస్య 1914లో యువకుడైన ఐవాన్ మైఖెలోవిస్కీ అనే రష్యన్ ప్రొఫెసర్ దృష్టిని ఆకర్షించింది, మైఖెలోవిస్కీ ఖార్కోవ్ యూనివర్సిటీలో పనిచేస్తూ వుండేవాడు.

విషంవల్లచనిపోయే జంతువులను-మనుష్యులనుకూడా-బ్రతికించడానికి అతడొక సూత్రాన్ని కనిపెట్టాడు. విషపూరితమైన ఆ జంతువుల రక్తాన్ని బైటికితోడి, దానిని కడిగి వడపోసి, విషాన్ని తీసివేసి, తిరిగి శరీరంలోనికి ఎక్కించవచ్చుననీ, ఆవిధంగా అర్ధంతర మరణాన్నుంచి వాటిని కాపాడవచ్చుననీ, అతని సిద్ధాంతం.

మైఖెలో విస్కీ ఈపద్ధతిని సూచించినప్పుడు చాలమంది శాస్త్రవేత్తలే నవ్వారు. అతడొక వూహా ప్రపంచంలో విహరిస్తున్నాడని ఎగతాళిచేశారు. యువకుడైన మైఖెలోవిస్కీమాత్రం "నవ్విపోదురుగాక నాకేటిసిగ్గు" అనుకున్నాడు. తన పరిశోధనలను మానుకోలేదు. కానిపాడు ప్రపంచయుద్ధం (1914-18) వచ్చి అతని కృషిని దెబ్బకొట్టింది. అతడు కూడా యుద్ధ రంగానికి రిక్రూటుచేసి పంపబడ్డాడు. 1924 వరకూ కూడా తన పరిశోధనలను తిరిగి ప్రారంభించడానికి అతనికి అవకాశం దొరకలేదు. సోవియటు మధ్యఆసియాలో ఉజబెకిస్తాన్ రిపబ్లిక్‌లో టాష్కెంట్ యూనివర్సిటీలో మైఖెలోవిస్కీ తన పరిశోధనలు ప్రారంభించాడు.

రక్తాన్ని వడపోసి మళ్ళీ ఎక్కించవచ్చు

శరీరంలోనుంచి రక్తాన్ని తీసి, కడిగి వడపోసి మళ్ళీఎక్కించడ మంటే సామాన్య విషయం కాదు. ఎందుకంటే శరీరంనుంచి రక్తం బైటికివచ్చిన కొద్దినిమిషాల్లోనే పేరుకుపోతుంది. అలాగడ్డకట్టుకుపోకముందే ఈ వడపోత కార్యక్రమమంతా పూర్తిఅవాలి. అదీగాక ఈవిధంగా శరీరంలోని రక్తాన్ని పైకి తోడివేసి మళ్ళీ ఎక్కించడంవల్లగాని, ఆ పని చేయడంలోగాని ఆ శరీరానికి ఏవిధమైన హానీ జరగకుండా వుండాలి.

అందుచేత మైఖెలోవిస్కీ ముందుగా ఒక విషయం తేల్చుకోదల్చుకున్నాడు. ఏదైనా జంతువు శరీరంలోని రక్తాన్ని కొంతతీసి, అది పేరుకుపోకుండాచేసి, దానిని తిరిగి ఆ శరీరంలోకి ఎక్కించగలమా లేదా రుజువు చేసుకోవాలి.

రక్తం పేరుకోవడమనేది ఎలా జరుగుతుంది అనే విషయం తెలుసుకుంటే దానిని పేరుకుపోకుండా ఎలాచేయవచ్చునో బోధపడుతుంది. శరీరంలోనుంచి రక్తం బైటికి వచ్చినప్పుడు దానిలోవుండే ద్రవంలో ఒక తెల్లని జిగురుగా వుండే పదార్థం (Albuminous Substance) ఏర్పడుతుంది. అదే రక్తాన్ని గడ్డకట్టేటట్లు చేస్తుంది. కనక బైటికితీసినరక్తంలో ఈతెల్లని జిగురుపదార్థం ఏర్పడకుండా చేయగలిగితే అది పేరుకుపోకుండా ఇదివరకున్నద్రవరూపంలోనే వుంటుంది. ఇలా గడ్డకట్టుకు పోకుండాచేసే విధానాన్నే డిఫైబ్రినేషన్ అంటారు, ఇక్కడ ఇంకో ముఖ్యవిషయంకూడా తెలవలసివుంది. రక్తాన్నిఇలాడిఫైబ్రినేట్ చేసినప్పుడు దానిలోని ఎర్రకణాలు ఏమీదెబ్బతినకుండా వుండాలి. ఇది చేయగలిగితే మనం విజయం పొందినట్లే.

చనిపోయిన కుక్క బ్రతికింది

మైఖెలోవిస్కీ ముందు ఈ విషయాన్ని తేల్చుకోవాలని నిశ్చయించాడు. ఒక కుక్కను తెచ్చి దాని శరీరంలోని రక్తకణాల్లోవుండే రక్తాన్నంతా (ఇది శరీరంలోవుండే మొత్తం రక్తంలో నాలుగోవంతు వుంటుంది.) బైటికి తోడి, డిఫైబ్రినేట్ చేశాడు. దానిని మళ్ళీ కుక్క శరీరంలోనికి ఎక్కించాడు. రక్తాన్నితోడి వేయడంవల్ల స్పృహతప్పి చచ్చిపోయినటు పడివున్న ఆకుక్క యథాప్రకారంగా లేచి తిరగడం మొదలుపెట్టింది. మైఖెలో విస్కీ ప్రథమ విజయం సాధించాడు.

డిఫైబ్రినేషన్‌వల్ల రక్తంలోని ఎర్రకణాలు చెడిపోవనీ, ఆరక్తాన్ని తిరిగి శరీరంలోకిఎక్కించడంవల్ల జంతువు మామూలుగానే బ్రతుకుతుందనీ రుజువు చేసుకొన్న మైఖెలోవిస్కీమరో విషయాన్ని కూడా చూడదలచుకున్నాడు బైటికి తీసి డిఫైబ్రినేట్ చేసిన రక్తాన్ని అంతా ఒక్కసారే శరీరంలోకి తిరిగి ఎక్కించకుండా, రెండు మూడు దఫాలుగా ఎక్కించవచ్చునా లేదా అని కూడ తేల్చుకోవాలనుకున్నాడు. ఆ విధంగా మొదట కొంతరక్తాన్ని ఎక్కించి, మిగిలిన దానిని మంచులో పెట్టి కొన్నాళ్లుంచి, తరువాత ఎక్కించాడు. ఈ ప్రయత్నంలో కూడా విజయము పొందాడు.

మరో మెట్టుపైకి

పోతే, ఇక విషప్రయోగంవల్ల చనిపోయే జంతువులను, అవి పూర్తిగా చనిపోకముందే వాటిరక్తాన్ని తీసి కడిగి వడపోసి మళ్ళీ శరీరంలోకి ఎక్కించి బ్రతికించగలమా లేదా అనే సంగతికూడా తేల్చుకోవాలి. ఇందులో విజయం సాధిస్తే, అకాలమరణాలను జయించడంలో ఒక మెట్టు పైకి ఎక్కినట్లే.

మార్ఫియా అనే విషం ఎక్కువ దోసు ఇవ్వడంవల్ల చనిపోతూవున్న ఒక కుక్కను తీసుకున్నాడు. విషం యిచ్చిన 20 నిమిషాలకి దాని శరీరంలోని రక్తాన్ని తీసి డిఫైబ్రినేట్ చేశాడు. అలా చేసినదానిలో నాలుగోవంతు రక్తాన్నిమాత్రమే తిరిగి శరీరంలోకి ఎక్కించాడు. అది పూర్తిగాచచ్చిపోకుండా నిలపడానికి ముందు ఈపనిచేశాడు, మిగిలిన రక్తంలోని విషాన్ని కడిగివేయడానికి లాకిన్ సొల్యూషన్ అనే విషహరణ ద్రవ్యంలో కలిపి దానిని

జయించాడు ★ — "రావు"

బడ నక్కర లేదు

మంచులో కొంతసేపు వుంచాడు. ఇలాచేస్తే ఎర్రకణాలు అడుగుకు దిగుతాయి. ఈవిధంగా కడగబడిన ఎర్రరక్తకణాలను ఒకకృత్రిమ ద్రవ పదార్థంలో కలిపి రక్తం మాదిరిగా పల్చనచేసి కుక్కశరీరంలోని మంచిరక్తనాళాల (అర్టరీల) లోకి ఎక్కించాడు. అలాచేస్తే ఆకుక్క బ్రతిక్రింది. తరువాత పరీక్షచేస్తే దాని శరీరంలో విషం (మార్ఫియా) వున్న లక్షణాలు ఏమీ కనబడలేదు.

తరువాత మైఖెలోవిస్కీ. కుందేళ్ళమీద. కోతులమీదకూడ ఇలాంటి విషప్రయోగాలనే చేసి తన సిద్ధాంతాన్ని పదేపదే పరీక్షించి చూచుకున్నాడు. మనుష్యుల విషయంలో కూడ తప్పక విజయం పొందగలననే ధైర్యం అతనికి నానాటికీ ఎక్కువ కాజొచ్చింది,

1925 లో తన సిద్ధాంతాన్ని గురించి చెబుతూ, మార్ఫియా, ఆల్కహాల్, కార్బన్ మోనాక్సైడ్ మొదలైన విషాలవల్ల చని పోయే మనుష్యులను కూడా గ్యారంటీగా రక్షించవచ్చునని ఉద్ఘాటించాడు.

కానైతే, మైఖెలోవిస్కీ వెంటనే మనుష్యుల మీద పరిశోధన సాగించదలచుకోలేదు. అతడు పనిచేసే యూనివర్సిటీ ఇంకా బాల్యావస్థలోనే వుంది. కావలసిన పరికరాలన్నీ సమకూర్చుకోవాలి. ముఖ్యంగా కడగబడిన రక్తంలో నుంచి ఎర్రకణాలను తొందరగా వేరు చేసేందుకు స్యూపర్ సెంట్రిఫ్యూజీ అనే సాధన సామగ్రి కావాలి. అది అప్పటికి (1925) సోవియట్ యూనియన్‌లో ఎక్కడా లేదు. ఒక్క ఫ్రాన్సుదేశంలోనే అది దొరుకుతుంది. దానికి ఆర్డరు యిచ్చారు దురదృష్టవశాత్తు అది రాకముందే (1929 లో) మైఖెలోవిస్కీ చని పోయాడు.

రక్తం వడపోతవల్ల శరీరానికి కొత్తశక్తి వస్తుంది

మైఖెలోవిస్కీ మరణించినంత మాత్రాన ఆ పరిశోధన అంతంకాలేదు. ఈ కొత్తసాధనంతో, అతని అనుచరులలో ఒకడైన చెపోవ్ ఆ సూత్రాన్ని మరింత అభివృద్ధిచేసి నైపుణ్యం సంపాదించాడు. రెండో ప్రపంచయుద్ధానికి ముందు చెపోవ్ సోవియట్ మెడికల్‌సైన్సు ఎకాడమీలో మైఖెలోవిస్కీ సూత్రాన్ని శాస్త్రవేత్తలందరిముందూ ప్రదర్శించి రుజువుచేశాడు. అంతా పదినిమిషాలలోచేసి చూపాడు. మనుష్యుల విషయంలోకూడా ఇది నిస్సందేహంగా అమలు జరపవచ్చుననీ, ఈ విధంగా కడిగి పరిశుభ్రపరిచిన రక్తాన్ని తిరిగి శరీరంలోకి ఎక్కించడంవల్ల విషం పోవడమేగాక మనిషికి ఒక నూతనశక్తికూడా కలుగుతుందని చెపోవ్ విశ్వాసం

చెపోవేగాకుండా కజకిస్థాన్‌లో అల్మ ఆటాలో గ్లోస్మన్ అనే మరోశాస్త్రవేత్తకూడ ఇదేసూత్రంపై పరిశోధనలు చేస్తున్నాడు. కొద్దిరోజుల్లోనే యీ సూత్రంవల్ల బ్రతికింపబడే మనుష్యుల్నికూడా మనం తప్పక చూడగలం.

("సోవియట్ వీక్లీనుండి")

(14 వ పేజీ తరువాయి)

దిద్దటం మరీకష్టం. అందుచేత యిటువంటి పిల్లలకు చదువుమీద అభిరుచి కల్గించవలసిన బాధ్యత తల్లిదండ్రులమీదఉంది. ఈ అభిరుచిని ఎలాకల్గించాలన్నదే ప్రశ్న. బొమ్మల పుస్తకాలు కథలపుస్తకాలు పిల్లకు అర్థమయ్యేటట్లు తల్లి బోధచేయాలి. ప్రతికథా చదివి వినిపించాలి. మధ్యమధ్య పిల్లవేసే ప్రశ్నలకు విసుగుకోకుండా సరియైన సమాధానమివ్వాలి. కొన్ని నెలలు తరబడి యీవిధంగా బొమ్మల పుస్తకాలు కథలు యిద్దరు కలిసి చదవడంద్వారా కథలమీద బొమ్మలమీద అభిలాష చదువు మీదకు కూడ ప్రాకుతుంది. చదువుకుంటే యింతకన్న మంచికథలు తామే స్వంతంగా చదువుకోవచ్చుననే విషయం పిల్లలు గుర్తించేటట్లు చేయాలి. ఈ అంతస్తు కొచ్చినాక తల్లిదండ్రుల ప్రయత్నమే లేకుండా కథలయందలి యభిలాషచేత వారంతటవారే చదువుకుంటారు. కనుక యీసోదరికి నానలహా ఏమంటే ఏమీ ఆసక్తికల్గించని పొడి అక్షరాలు దిద్దటం మాన్పించి తనుకూడా పిల్లల చదువుయందు శ్రద్ధచూపి రోజుకు రెండు మూడు గంటలు కథలు బొమ్మల పుస్తకాలద్వారా చదువుమీద అభిలాష కలిగించాలి.

నంద్యాల యువజన మహాసభ

28 29-6-47 న నంద్యాల పట్టణయువజన మహాసభ అతివైభవంగా జరిగింది. యువజన సంఘం అక్కడ రైతులకు వేరుశనగచెక్క సప్లయి చేయుటలోనూ, బ్లాకుమార్కెటులను పట్టుకొనుటలోనూ పేరుకెక్కింది మహాసభకు రు 460 లు వసూలుచేశారు. మహాసభ అయిదు రోజులు ముందుగా 50 మందితో ప్రతిరోజూ ప్రభాతఫేరీలు జరిపి విరివిగా ప్రచారం చేశారు. ఆటలపోటీలు జరిపారు. దండాలు, బస్కీలు, పరుగు, బరువులెత్తుటలో పోటీలు జరిగాయి. 65 మంది యువకులు పాల్గొన్నారు. యువజన కాంగ్రెసు, కైప రాధాకృష్ణమూర్తి. కొద్ది మందీ కలసి వ్యతిరేకప్రచారము, కరపత్రములు వేయుట జరిగినమా, ప్రజలందరూ మహాసభకు చేయూతనిచ్చి సహాయం చేశారు. సంఘసభ్యులుగా దాదాపు 60 మంది ముస్లిం యువకులున్నారు. మహాసభ కమిటీలో 5 గురు ఉన్నారు. ఇట్లా హిందూ-ముస్లిం భేదంలేక మహాసభను జయప్రదంగా జరిపారు.

మహాసభకు డా॥ రాజారావుగారు అధ్యక్షత వహించి యువకులు విజ్ఞానవంతులు కావాలంటే తప్పకుండా సారస్వతంలోనూ, కళలలో కూడ కృషిసల్పాలని, పూర్వపు ఆంధ్రసంస్కృతిని తిరిగి మనం సంపాదించాలని ఉద్బోధించారు శ్రీ కా॥ కోటేశ్వరరావుగారు మహాసభను ప్రారంభించుతూ యువకులంతా ప్రజాసేవను తమ కర్తవ్యంగా భావించి పనిచేయాలని చెప్పారు. వైజ్ఞానికకార్యక్రమంతో మహాసభ జయప్రదంగా ముగిసింది.

విమర్శ

"మా భూమి"

(తెలంగాణా ప్రజల వీరోచిత పోరాటాన్ని చిత్రించే నాటకం)

రచయితలు : సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు

ప్రజాశక్తి ప్రచురణ   వెల రూపాయి

"మాభూమి" నాటకాన్ని గురించి ఆంధ్ర లోకానికి ఇప్పుడు కొత్తగా పరిచయం చేయవలసిన అవసరం ఏమీలేదు. ఎందుకంటే ఆంధ్ర ప్రజానాట్యమండలివారి ప్రదర్శనల ద్వారా వేలకొలది ఆంధ్ర ప్రజానీకం ఆ నాటకాన్ని చూస్తున్నారు. అది వారిని ఉద్రూత లూగించుతోంది. ప్రతి ప్రదర్శనానికి టిక్కెట్లు దొరకక నిరుత్సాహంతో తిరిగిపోయేవారనేకు లున్నారు. ఈ నాటకం ప్రదర్శించడం ప్రారంభిచి రెండు నెలలైనా కాకుండానే ఒక్క బెజవాడలోనే ఇప్పటికి 5 ప్రదర్శనాలు జరిగాయి. ఎప్పుడుచూచినా హాలు కిక్కిరిసే వుంటోంది. తనివితీరక రెండు మూడుసార్లు వచ్చి చూచే ప్రేక్షకులుకూడా వందలకొలది ఉన్నారు. ఈ నాటక ప్రాశస్త్యాన్ని తెల్పడానికి ఒక్క ఉదాహరణ చాలు.

*　　*　　*

యదార్థం ఇలావుండగా మన "అభ్యుదయ" ప్రతికలో "ప్రయాగ" వారికి మాత్రం ఇది "చచ్చురకం భావకవిత్వం" లాగ కనిపిస్తోంది. ఈ "విద్వాన్"గారు తనకుతెలంగాణా పరిస్థితులేమిటో తెలియకుండానే ఈ నాటకం అక్కడి "ప్రజల జీవితాన్ని, పోరాటాన్ని వాస్తవికంగా ప్రదర్శించక దాని కొక వికృత స్వరూపం కల్పించిందని"ఏమేమో వ్రాశారు. పైగా ఆపుస్తకాన్ని సరిగా చదవనైనా చదవకుండా అందులో వున్న విషయాలను లేవని, లేనివి వున్నాయని కూడ వ్రాయసాహసించారు.

"అభ్యుదయ" పత్రికలో "ప్రయాగ" వారి విమర్శనలోని పసఎంతో చూపుతాను.

*　　*　　*

"విద్వాన్ ప్రయాగ" ఇలా విమర్శిస్తున్నాడు. ఈనాటకంలో ఆంధ్రమహాసభ రాజకీయ ప్రభావాన్నిగాని, తెలంగాణా ప్రజలు తమప్రాణ సమానంగా గౌరవించే నారాయణరెడ్డి, ఎల్లారెడ్డి మొదలైన ప్రజానాయకుల ప్రభావాన్నిగాని ఏపాత్రా ప్రతిబింబించదు" అంటున్నాడు. దీనికి ఆ నారాయణ రెడ్డిగారే చక్కని సమాధానం చెప్పారు.

27-8-47 తేదీని బెజవాడలో జరిగిన "మాభూమి" ప్రదర్శనాన్ని చూచి. హాలులో వున్న దాదాపు 2 వేలమంది ప్రేక్షకుల ఎదుట నారాయణరెడ్డిగారు "ఈనాటకం నేటితెలంగాణా ప్రజాజీవితాన్ని ఆంధ్ర మహాసభ నాయకత్వాన వారు సల్పే పోరాటాన్ని ఎంతోసహజంగా చిత్రంచుతోంది" అని ప్రశంసించారు. నేటి తెలంగాణాను గురించి ప్రయాగవారి కున్న "జ్ఞానం" ఎంతో తెల్పడానికి ఇంతకంటే ఏమి కావాలి ?

తెలంగాణాలో ప్రజా ఉద్యమం ఎలా వ్యాపించిందో ప్రయాగవారికి ఏమీ తెలియదనడానికి ఇంకో ఉదాహరణచూపుతాను. "ఒక్క రోజు కూడా లేని వ్యవధానంలో ఊరూ నాడూ కలిసినట్లు చూపడం నేటి వాస్తవిక ప్రజాజీవితాన్ని ప్రజాసమస్యలను, ప్రజల రాజకీయస్థాయిని అర్థం చేసుకోడం అనిపించు కోదు" అని ఆయన అంటున్నాడు.

ఒక్కరోజులో ఊరూనాడూ ఏకమవడమనేది అంతకు పూర్వమే ఎంతోకాలంనుంచి దేశముఖు జరిపే దురాగతాలపట్ల ప్రజలలో రగులుతున్న ప్రతీకారవాంఛ బహిర్గతమయ్యే ఒక ప్రత్యక్షసంఘటన తప్ప మరేమీ కాదు. నల్లగొండ జిల్లాలో దేశముఖుల దురంతాల నరికట్టడానికి బయలుదేరిన ఆంధ్రమహాసభ ఉద్యమం గ్రామగ్రామానికీ ఎలా వ్యాపించిందో కూడా చూడవచ్చు. ఒక గ్రామంలో ఆంధ్ర మహాసభను (సంఘాన్ని) ఏర్పరచుకున్న ప్రజలంతా పెద్ద ఊరేగింపుగా ప్రక్కగ్రామాలకు వెళ్ళడం, అవూళ్ళలోని వారందరినీ సంఘంలో చేర్చడం, ఇలా గ్రామాలకుగ్రామాలు పూర్తిగా సంఘంలో చేరి మర్నాడునుంచీ దేశముఖులకు వెట్టిచేయడం, లంచాలివ్వడం వగైరా మానివేశారు. ఇది తెలుసుకోకుండా అదంతా ఒక రోజులోనే జరిగింది కనుక అది నేటి వాస్తవిక ప్రజాజీవితాన్ని చిత్రించడం లేదనడంలో ప్రజాఉద్యమాలను, ప్రజల రాజకీయస్థాయిని అర్థంచేసుకోలేకపోయినది ఎవరు? "ప్రయాగ" వారా ? ఆ సత్యాన్ని చిత్రించిన "మాభూమి" నాటక రచయితలా ?

*　　*　　*

పోతే ప్రజాసమస్యలపట్ల ఈ "అభ్యుదయ విద్వాంసు"డికి వున్న గౌరవం కూడా ఎంతో చూడండి. "ఏదోఒక మేకపోతును ఎత్తుకు పోకుండా దేవర పోతునే ఎత్తుకు పోవడం, ఎవరో త్రాగుబోతులు ఒక స్త్రీని అల్లరిచేయడం - ఇవే ఇవాళ ప్రజలందరినీ కలవరపరచి ఐక్యతను సాధించగల బలమైన సమస్యలు కావు" అని సెలవిచ్చాడు. ఈయన దృష్టిలో స్త్రీలను అల్లరిచేయడం అనేది "బలమైన సమస్య" కావాలంటే ఆ దేశముఖు ముఠా రౌడీలు గ్రామంలోని స్త్రీలందరినీకూడా అల్లరిచేయాలన్నమాట. అంతవరకూ అది కలవరపచ్చదన్నమాట. ఈయన దృష్టిలో ప్రతిఊరూ ఒక అకునూరు (ఈ గ్రామంలో నైజాం పోలీసులచే చాలామంది తెలుగుస్త్రీలు చెరచబడ్డారు) కావాలన్నమాట! ఇంకా నయం. శాస్త్రిర్లుగారు అంతటితో ఆగారు. స్వయంగా చూస్తేతప్ప అలాంటివి జరిగాయని నమ్మడానికి వీలులేదని, అప్పుడుగాని మానవుడ్ని అది కలవరపరచదని అనలేదు !

అదీగాక ఇలాగ స్త్రీలను అల్లరి చేయడం గొల్లల మేక పోతులను ఎత్తుకుపోవడం, రైతుల గిత్తలను తోలుకుపోవడం మొదలైన దురాగతాలు దేశముఖురౌడీలు నిత్యం సాగించుతున్నారనే విషయం నాటకం చదివిన ప్రతివారికీ తెలుస్తుంది, అయినా "ప్రయాగ" వారికి ఇంకా సంతృప్తి కలుగలేదు కాబోలు ! అలాగే బందగీ సమాధివద్ద ఏవోసమస్యల జాబితా వల్లించి కథానాయకుడు వీరారెడ్డి వగైరా సంఘం పెట్టుకోవాలనుకుంటారు !' అని అవహేళనచేశారు. దేశముఖు రైతులనుచంపించడం, వారి భూములను లాగుకోడం, వెట్టిచేయించుకోడం, లంచాలు గుంజడం, దొంగ పద్దులు వ్రాయడం, రైతులకు అవసరమైన బండి బట్టాలు నూనె వగైరా సరకులు అందనివ్వకపోవడం, జమీందారురౌడీలు రైతులను కొట్టడం, స్త్రీలను అల్లరిచేయడం ఇలాంటి వన్నీ "ఏవోసమస్యల జాబితా"గా కనిపిస్తున్నాయి వీరికి !

ఈరచన "రంగుపూసి వాస్తవాన్ని మరుగుపరచి ప్రజల్ని సంతృప్తి పరచడానికి ప్రయత్నిస్తుంది. అని మాగ్జింగోర్కీ అన్నమాటలను ఇక్కడ వల్లిస్తున్నాడు.

*　　*　　*

దీనితోపాటు నాటకాన్ని సరిగా చదవకుండానే "విద్వాన్ ప్రయాగ" విసిరిన విసురులు కూడా మచ్చుకు రెండు చూపుతాను.

"అతి ప్రధానమైన లెవీసమస్యమీద జరుగుతున్న పోరాటాల ప్రభావం ఇందులో ప్రతిబింబించడంలేద"ని ఒక విమర్శ. కాని నాటకంలో మనకి కనిపించేది ఏమిటి? రైతులు క్రిందటి సంవత్సరం ఇచ్చిన లెవీ ధాన్యం బాపతు సొమ్మును దేశముఖు, పట్వారీ కలిసి కొట్టేస్తే, ముందు ఆ సొమ్ము సంగతి ఏమిటని రైతులు అడుగుతారు. తరువాత పండక పోయినా లెవీ కట్టమని నిర్బంధిస్తే కట్టలేమని జవాబు చెబుతారు. 20 వేల ఎకరాలున్న దేశముఖును, 6 వేల ఎకరాలున్న పట్వారీని ముందు వారివంతు లెవీని చెల్లించమని డిమాండు చేస్తారు. లెవీ సమస్యను ఉపయోగించుకొని దేశముఖు, పట్వారీలు నైజాం ప్రభుత్వపు పోలీసుబలగాన్ని తెచ్చి గ్రామం మీద దాడి జరిపించుతారు. ఆ సందర్భంలోనే యిరువురిని కాల్చి చంపుతారు. లెవీసమస్యపై నాటకంలో ఇంతవుంటే ఆ సమస్య ప్రభావమే చూపలేదనడం పుస్తకాన్ని చదవకుండా చేసే గుడ్డివిమర్శకాదా?

అలాగే "కోటలోకి వచ్చినప్పుడుకూడా రైతులు అతన్ని (దేశముఖును) లెక్కచెయ్యరు" అని మరోవిమర్శ. మొదటి విషయం రైతులు కోటలోకి వచ్చినప్పుడు అక్కడ దేశముఖులేడు. వారు పట్వారీతోనే ముఖాముఖి మాట్లాడుతారుగాని, దేశముఖుతో కాదు, అదీగాక ఒకవేళ నిజంగానే దేశముఖు ఎదురుగావున్నా రైతులు లెక్కచేయలేదనుకున్నా అందులో "ప్రయాగ" వారికికలిగిన కష్టం ఏమిటో మనకి బోధపడదు, దుర్మార్గుడైన దేశముఖును ఎదిరించడానికి ఐక్యమౌతున్న చైతన్యవంతులవుతున్న రైతులు అతనంటే భయపడవలసిన అవసరం ఏముంది? దేశముఖుయొక్క ఠీవిని చూపడంకోసం రైతులలో కలుగుతున్న విప్లవచైతన్యాన్ని ధైర్యాన్ని ప్రదర్శించకుండా వుండాలనా ఈ "అభ్యుదయకవి" అభిప్రాయం?

*　　*　　*

పోరాటాన్ని చిత్రంచే నాటకం ఎలావుండాలో తన విమర్శనలో ప్రయాగ కొన్నిఅభిప్రాయాలు ప్రకటించాడు. అవన్నీకూడా ప్రజాఉద్యమాలు ఎలా నిర్మించబడి సాగుతూవుంటాయో ఆయనకు తెలియదనే సత్యాన్నే వెల్లడి చేస్తాయి. స్థలాభావంచే అవన్నీ ఒక్కొక్కటే తీసుకని చర్చించడంలేదు కాని చివరకు ఒక్కముక్క మాత్రం చెప్పిముగిస్తాను. అక్కసు కొద్దీ, వాస్తవ పరిస్థితులు తెలియకుండా అలాంటి అపసవ్యపు వ్రాతలువ్రాయడంవల్ల నైజాముకు దేశముఖులకు తోడ్పడిన వారవడం తప్ప మరొకటికాదు. ఇది అభ్యుదయ రచతలందరికీ తలవంపు. ఆంధ్ర అభ్యుదయ రచయితలెవరూ దీనిని సహించరని ఆశిస్తున్నాను.

— "రావు"

★

క్రాంతి

గవర్నరుపేట, బెజవాడ.

బి. శివరామకృష్ణగారి సంపాదకత్వాన వెలువడుతున్న రాజకీయపక్షపత్రిక బ్రిటిష్‌సామ్రాజ్యవాదులు పఠానీస్థాన్‌ను తమ కుట్రలకు "కీలక కేంద్రంగా" ఉంచుకోడానికై అచ్చటి కొండ జాతి ప్రజలపై జరిపిన హత్యాకాండను, అచ్చటి పఠాను ప్రజాఉద్యమాన్ని "పఠానీస్థాన్" వ్యాసం వివరించింది. ఆంధ్ర జాతీయ వాఙ్మయనిర్మాత కీ. శే. శ్రీ కొమఱ్ఱాజు లక్ష్మణరావుగారినిగూర్చి, హైద్రాబాదు నవాబు పాలనలో జరుగుచున్న అత్యాచారాలను గురించి వ్యాసాలున్నవి. 'సైన్సు'; 'విద్యార్థి ఉద్యమాల' మీద వ్రాసే వ్యాసాల స్థాయి హెచ్చించబడాలి. సంస్థానాల్లో ప్రజలపైజరిగే హింసాకాండనేగాక మన దేశప్రజల స్వాతంత్ర్యాన్ని భగ్నంచేసేందుకై సామ్రాజ్యవాదుల సాయంతో జరిపే కుట్రలనన్నిటినీ బయలుపరుస్తూ వ్యాసాలు రాయాలి.

★

జ్యోతి

పి.వి.సుబ్బారావుగారి సంపాదకత్వాన తెనాలి నుండి వెలువడుతున్న పక్షపత్రిక. సాంఘికంగా, రాజకీయంగా, సాహిత్య దృష్ట్యాకూడ మంచిని మెచ్చుకునేందుకూ, చెడును చీల్చి చెండాడేందుకూ, మేము ఎప్పుడూ వెనుకంజ వేయము." అని పత్రికాశయాన్ని వివరించుకున్నారు. నిరంతరం సంపాదకులు ఈ ఆశయాన్ని విడనాడకుండా పాటుబడతారని ఆశించు తున్నాము.

— ఎ. కె. ఆర్.

నవయుగ

ఏజన్సీలు : అమ్మకాలు

కామ్రేడ్స్.

నవయుగ ముద్రణ మనము మార్చిలో ప్రారంభించాం. నవయుగకు స్థిరమయిన ఆర్థిక పరిస్థితుల కల్పించుటకుగాను ఎక్కువ చందాదారుల చేర్పించవలసిందిగాను, విరాళాలు పంపవలసిందిగాను, అమ్మకమును విస్తరింపజేసి ఎక్కువ చేయవలయుననియును సంపాదకవర్గము ఉద్యమకార్యకర్తలకు, ఏజెంట్లకు విన్నవించింది. ఈ ఆరునెలలకాలంలో లోటుపాట్లున్నప్పటికినీ కామ్రేడ్సంతా ఎన్నదగిన కృషి సల్పారు. ఫలితంగా రు 1800-0-0 విరాళాలు, 900 వరకు చందాలు ఆఫీసుకు చేరాయి, చందాల విషయంలో పాలకొల్లు, తుమ్మూరు యువజన సంఘాల కృషి ప్రశంసనీయమయినది. ఆంధ్రదేశంలో 110 ఏజెన్సీలతో మన పత్రికనలుమూలలా ప్రవేశించింది. ఈకారణంగా పత్రిక దినదినాభివృద్ధి చెందింది. ఈ రోజు 4000 ముద్రిస్తున్నాం. ఆంధ్రదేశంలో నవయుగ ప్రత్యేక స్థానం సంపాదించుకొన్నది. తత్కార్యనిర్వహణకు తోడ్పడిన కామ్రేడ్సందరికీ మా విప్లవాభివందనాలు.


★

మనం మన విజయసాధనతోపాటు ఆత్మవిమర్శనచేసికొంటూ ముందడుగు వేయాలి.

1. చందాదారులను చేర్పించిన కామ్రేడ్సు డబ్బు వెన్వెంటనే ఆఫీసుకు చేర్చుటలేదు, ఇట్లయిన యిది పాఠకలోకానికి అత్యాచారము చేసినవారమవుతాం. ఇకనైనా పైలోపము జరుగకుండా తాము చేర్పించిన చందాల డబ్బు వెంట వెంటనే ఆఫీసునకు కార్యకర్తలంతా చేర్చాలి.

2. సంఘ కార్యకర్తలలోఒకరు తమ స్థానిక ఏజెన్సీతో సంబంధముంచుకోవాలి. పత్రికా అమ్మకానికి తోడ్పడాలి. మనది ఉద్యమపత్రిక. వ్యాపారసంస్థవలె దీనిని నడపలేము. ఏజెంట్లు, కార్యకర్తలు పరస్పరానుభవంతో అర్థముచేసికొని ఆర్థికవిషయాల్లో ఆఫీసుకు తోడ్పడాలని ప్రార్థన. సకాలంలో బిల్లు చెల్లించి నవయుగకు ఆర్థికసౌష్టవము కల్గించెదరని విశ్వసించుచున్నాము.

Printed and Edited by A. K. R. B. Koteswara Rao at Prajasakti Press, Mogalrajapuram, Bezwada.
Published by K. Advita Parabrahma Sastri, B. A. from Navayuga office, Main Road, Kottapeta, Guntur.



Use SHARADA PLATE JEWELLS (REGD) ★ CHILAKALAPUDI KISTNA. DIST.

బంగారు కలరు గ్యారంటీ

●

మీ నిత్యాలంకారములకు **శారదాసెట్** మా నగలే వాడుడు

●

బంగారు కవరింగ్ ఆభరణములు

మా శారదా కంపెనీ ఆభరణములు, లోహముపై బంగారం అతికించి తయారు చేయబడినవి. అట్లు రుజువు కావలసిన ద్రావకంలో వేసిన బంగారం వెడలివచ్చును. నేడే వ్రాయండి :

శారదా గోల్డు కవరింగ్ జ్యూయలరీ వర్క్సు

ప్రొ: గుడిసేవ సుబ్బయ్య సన్

చిలకలపూడి P.O. ● కృష్ణా జిల్లా

ప్రసిద్ధిచెందిన ★

'కృష్ణా' రడీమేడ్ దుస్తులు

చౌకధరల్లో

నాణ్యమైన

రకరకాలబట్టల్లో

శా
వా
లిం
టీ

ఆంధ్రామోడ్రన్ డ్రస్ హోం

రాబర్టుసన్‌పేట

బందరు కు: → దయచేయండి

మంగుళూరు

మిలిటరీ భోజన, కాఫీ

హోటల్ అండ్ విశ్రాంతిభవనం

ప్రకాశంరోడ్ * గవర్నరుపేట * **బెజవాడ**

మా ప్రత్యేకతలు

●

పరిశుభ్రమైన వెన్న కాచిన నేతితో ఫలహారములు, భోజన పదార్థములు రుచికరముగా తయారుచేయబడును —

డిన్నరు, టీపార్టీలు మొదలగు వాటికి సప్లయి చేయుటకు ప్రత్యేక ఏర్పాట్లు గలవు —

ఇతర ప్రదేశాలనుంచి వచ్చిన వారు మకాముచేయుటకు తగిన వసతులు గలవు —

ఇట్లు:

కొత్తూరి సుబ్బారావు